

సరుకు ఖాళీ..!

నూతన ఎక్సైజ్ విధానం త్వరలోనే వెలువడనుంది. ఇప్పుడు అందరి దృష్టి రాబోయే కొత్త విధానం మీదే. గడిచిన ఐదేళ్లపాటు ప్రభుత్వం నిర్వహించిన మద్యం దుకాణాలు, ప్రత్యేక మాల్స్ అన్నింటిలోను క్రమేపి సరుకు ఖాళీ అవుతోంది. ఇప్పటికే జనం కోరుకున్న బ్రాండ్‌లు కాకుండా 'జె' బ్రాండ్‌లతో ముంచెత్తి ఆ మేరకే బలవంతపు వ్యాపారం చేశారు. పేదోళ్ల జేబులకు చిల్లు కొట్టారు. కొత్త ఎక్సైజ్ విధానంలో సామాన్యుడి దగ్గర నుంచి ఉన్నత వర్గాల వరకు కోరుకున్న సరుకు.. అందుబాటు ధరలోనే ఉండబోతుందన్నదే అందరి ఊహ.

- ప్రభుత్వ మద్యం దుకాణాల్లో తగ్గిన నిల్వలు
- రోజువారీ అమ్మకాల్లోను వైవిధ్యం
- కేవలం కొన్ని బ్రాండ్‌లకే అమ్మకాలు పరిమితం
- చీప్‌తో సరిపెట్టేస్తున్న మరికొన్ని దుకాణాలు
- త్వరలోనే కొత్త పాలసీ.. దీని ప్రభావమే ఇది

(ఏలూరు-ఆంధ్రజ్యోతి ప్రతినిధి) :

గత ఐదేళ్లలో మందుబాబులు 'జె' బ్రాండ్‌లతో సరిపెట్టుకున్నారు. ఎక్కడా లేని పేర్లతో రకరకాల సరుకు మార్కెట్‌లోకి చొప్పించి బలవంతంగా తాగించారు. పేరుకే ప్రభుత్వం నిర్వహించే మద్యం దుకాణాలైనా వాటిలోను ఎడాపెడా మందు గేడలు దాటింది. కొన్ని షాపుల్లో ఫోన్‌పే పేరిట అమ్మకాలు, మరికొన్ని దుకాణాల్లో నగదుకే మందు. ఇలా ఇష్టానురీతిన మద్యం వ్యాపారం సాగింది. ఎక్కడికక్కడ మద్యం దుకాణాలను ప్రారంభించి వాటి నిర్వహణను ప్రభుత్వమే చూసింది. వీటి నిర్వహణకు తాత్కాలికంగా ఉద్యోగులను నియమించి ఏ రోజుకారోజు నగదు చెల్లింపులన్నింటినీ బ్యాంకుకు చేర్చే బాధ్యతను వారికే అప్పగించింది. అంతకుముందు మద్యం వ్యవహారాలన్నింటినీ అబ్కారీ శాఖ పర్యవేక్షణలోనే సాగేది. జగన్ ప్రభుత్వ హయాంలో అబ్కారీ శాఖ పూర్తిగా నిర్వీర్యమైంది. బార్ల మీద, ప్రభుత్వం నిర్వహించే మద్యం దుకాణాల మీద ఈ శాఖ తమ అదుపు కోల్పోయింది. గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో చీప్‌లిక్కర్ రూ.60 నుంచి రూ.90 ధర ఉండేది. కాని గడిచిన ఐదేళ్లలో దీని ధర రెట్టింపు చేసి పేదోళ్ల జేబులు ఖాళీ అయ్యేలా చేశారు. ఒకవైపు మద్య నిషేధం అని రంకెలు పెడుతూనే ఇంకోవైపు మద్యం వ్యాపారంలో ఇష్టానుసారం వ్యవహరించారు.

ఇంతకీ సరుకేది..?

జగన్ ప్రభుత్వం వైదొలిగి ఆ స్థానంలో కూటమి ప్రభుత్వం కొలువుతీరింది. నిర్వీర్యమైన ప్రతీ రంగాన్ని ప్రక్షాళన చేస్తోంది. ఇదే సందర్భంలో త్వరలోనే నూతన మద్య విధానాన్ని అమలులోకి తేబోతుంది. కాని అంతకుమునుపే ప్రభుత్వ మద్యం దుకాణాల్లోను, మాల్స్‌లోను మద్యం స్టాక్ ఖాళీ అవుతూ వస్తోంది. కొత్త విధానం అమలులోకి వస్తే పాత విధానంలో ఉన్న అనేక బ్రాండ్‌లకు కాళ్ళు రావచ్చు. అందుకనే త్వరత్వరగా ఉన్న బ్రాండ్‌లన్నిటిని వదిలించుకునే పనిలో పడ్డారు. జిల్లా వ్యాప్తంగా అన్ని చోట్ల ఉన్న ప్రభుత్వ రిటైల్ షాపులన్నీ కేవలం కొన్ని బ్రాండ్‌లకే పరిమితమయ్యాయి. కేవలం చీప్ రూ.130, రూ.150 రకాల బ్రాండ్‌లు మాత్రమే ఇప్పుడు అమ్మకాలు సాగిస్తున్నారు. బారుల్లో అన్ని రకాల బ్రాండ్‌ల సౌలభ్యత ఉండగా రిటైల్ షాపుల్లో ఒక్కొక్కటిగా బ్రాండ్‌లన్నీ ఖాళీ అవుతున్నట్టు మందు బాబులంతా గోల చేస్తున్నారు. రెండు నెలల ముందు వరకు బ్రాందీ, విస్కీలలో కొన్ని ప్రైమ్ బ్రాండ్‌లను క్వార్టర్లలో విక్రయించేవారని, ఇప్పుడు ఆ పరిస్థితి పోయి కేవలం రెండు, మూడు రకాలకే పరిమితం అయ్యారన్న ఆగ్రహంతో ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రిటైల్ షాపులన్నింటిలోనూ ఇలాంటి పరిస్థితే నెలకొంది. నూతన ఎక్సైజ్ విధానంలో అమలులోకి రాకముందే ఉన్న సరుకును ఖాళీ చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి తగ్గట్టుగానే రిటైల్‌షాపులు, మాల్స్ అన్నింటిలోనూ ఫ్రిజ్‌ల్లో పెట్టాల్సిన బీర్ రకం బ్రాండ్‌లన్నింటినీ దాదాపు పక్కన పెట్టేశారు. కొన్నిచోట్ల అనేక షాపులు, మాల్స్‌లోను పని చేయని ఫ్రీజర్లే కనిపిస్తున్నాయి. పనిలోపనిగా ఇక్కడ అమ్మకాలు తగ్గించడంతో విసుగెత్తిన జనం బారుల వైపు మొగ్గుతున్నారు. దీంతో రూ.150 భరించే సాధారణ వ్యక్తి ఇప్పుడు రూ.280 చేతి చమురు వదిలించే పరిస్థితిలో మందు బాబులు ఉన్నారు. తాజా పరిస్థితిపై తనిఖీలు చేయాల్సిన యంత్రాంగం ఎప్పుడో చేతులెత్తేసింది. అబ్కారీ శాఖ తమకు పట్టనట్టుగానే మిగిలింది.

కొత్త విధానం ఎలా ఉండబోతుంది..

పాత మద్య విధానంలో అప్పటి జగన్ ప్రభుత్వం ఒకవైపు బటన్ నొక్కుడు.. ఇంకోవైపు సాధారణ ప్రజల జేబు నొక్కుడుగానే మద్యం వ్యవహారం సాగింది. ఇప్పుడు ఈ స్థానంలో కూటమి ప్రభుత్వం నూతన మద్యం పాలసీని కొద్దిరోజుల్లోనే తేబోతుంది. ప్రభుత్వమే నిర్వహిస్తున్న మాల్స్ రిటైల్ దుకాణం స్థానంలో మార్పులు, చేర్పులు జరగనున్నట్టు ప్రచారం సాగుతోంది. జగన్ ప్రభుత్వంలో ప్రజలతో చెలగాటమాడిన ప్రెసిడెంట్ షీల్డ్, భూమ్‌భూమ్, బ్లాక్ బస్టర్, రాయల్ ప్యాలెస్ వంటి బ్రాండ్‌ల స్థానంలో మద్యం ప్రియులు అత్యధికంగా కోరుకునే దాదాపు 19 రకాల బ్రాండ్‌లు ఈసారి రాబోతున్నట్టు ప్రచారం సాగుతోంది. ఇంపీరియల్ బ్లూ (ఐబీ), రాయల్ స్టాగ్, ఎంసీ విస్కీ వంటి రకాలన్నింటినీ తిరిగి విక్రయించబోతున్నారనే సమాచారం ఇప్పటికే మార్కెట్‌లో గుప్పుమంటోంది. వీటితో పాటు ప్రైమ్ బ్రాండ్‌లన్నింటిని విక్రయానికి అందుబాటులో ఉంచుతారని ఇంకో ప్రచారం. అలాగే బార్‌లు, మద్యం దుకాణాల నిర్వహణపైన సరికొత్త నిర్ణయాలు తీసుకోబోతున్నారు.

కమిషనర్‌గా భానుప్రతాప్ బాధ్యతలు



ఏలూరు టూటౌన్, ఆగస్టు 24 : నగర పాలక సంస్థ నూతన కమిషనర్‌గా భానుప్రతాప్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు బాపట్ల కమిషనర్‌గా వ్యవహరించిన ఈయన సాధారణ బదిలీల్లో భాగంగా ఏలూరుకు బదిలీ అయ్యారు. 2004లో ఏపీపీఎస్సీ గ్రూప్-2 ద్వారా ఎంపికై ప్రభుత్వ ఉద్యోగంలో చేరారు. 2007లో మొదటిసారిగా పిడురాళ్ళ మునిసిపాలిటీ కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించారు. సత్తెనపల్లి, కావలి, నరసారావుపేట, అనంతపురం, బాపట్లలో కమిషనర్‌గా విధులు నిర్వహిస్తూ ప్రస్తుతం ఏలూరుకు బదిలీపై వచ్చారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ .. 'పారిశుధ్యంపై ఎక్కువగా దృష్టిపెట్టి ఆరోగ్యవంతమైన నగరంగా తీర్చుదిద్దుతా. స్వచ్ఛమైన తాగునీటిని ప్రతీ ఒక్కరికి అందించేందుకు కృషి చేస్తా. వీధిలైట్లు సక్రమంగా వెలిగేటట్లు చర్యలు తీసుకుంటా. అనధికార లేఅవుట్లపై ఉక్కుపాదం మోపుతా'మన్నారు.

రూ.12.78 కోట్లు

- జిల్లాకు 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు విడుదల
- సకాలంలో విడుదల కావడంతో పంచాయతీలకు జవసత్వాలు

ఏలూరు సిటీ, ఆగస్టు 24 : గత కొన్ని దశాబ్దాలుగా ఆర్థిక సంఘ నిధులు పంచాయతీల్లో అభివృద్ధికి ఆసరాగా నిలుస్తున్నాయి. ఈ నిధులు మండల పరిషత్‌లకు, జిల్లా పరిషత్‌లకు మంజూరయ్యేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ నిధులను పంచాయతీలకు జమ చేయకుండా ఇతరత్రా పథకాలకు వినియోగించడంతో అప్పట్లో సర్పంచ్‌ల సంఘాలు ధ్వజమెత్తాయి. ఈ క్రమంలోనే గ్రామాల్లో అభివృద్ధి నిర్వీర్యమైంది. ఎన్నికలు దగ్గర పడుతున్న సమయంలో గతేడాది జూన్ 28న హడావుడిగా 15వ ఆర్థిక సంఘ నిధులు మొదటి విడత నిధులను వైసీపీ ప్రభుత్వం విడుదల చేసింది. ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పంచాయతీలకు జవసత్వాలు వచ్చాయి. పంచాయతీలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి జరుగుతుందనే ఉద్దేశ్యంతో జిల్లాలోని 544 గ్రామ పంచాయతీలకు సంబంధించి 15 ఆర్థిక సంఘ రెండో విడత నిధులు 12 కోట్ల 78 లక్షల 59వేల 607 రూపాయలను విడుదల చేసింది. మొత్తం 547 పంచాయతీలున్నా మూడు పంచాయతీలకు ఎన్నికలు జరగపోవడంతో ఆ పంచాయతీలకు నిధులు కేటాయింపు లేదని అధికారులు చెబుతున్నారు. ఒక పక్క ఉపాధి హామీ నిధులతో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేసి స్వర్ణ గ్రామాలుగా తీర్చిదిద్దాలని నిర్ణయించిన సమయంలోనే పంచా యతీల్లో ఇతరత్రా అవసరాలకు, అభివృద్ధికి ఆర్థిక సంఘ నిధులు ఆసరాగా నిలవనున్నాయి. గ్రామాల్లో వివిధ పనులు నిర్వహించుకోవడంతో పాటు విద్యుత్ బిల్లుల బకాయిలు చెల్లించడానికి అవకాశం ఏర్పడుతుంది. గ్రామాల్లో మంచినీటి బోర్లకు సంబంధించి తాత్కాలిక మరమ్మతులు చేయడానికి, పారిశుధ్య పనులకు అవసరమైన నిధులు కేటాయించుకోవచ్చు. పశ్చిమగోదావరి జిల్లాకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు 393 గ్రామ పంచాయతీలకు రూ.9.89 కోట్లు నిధులు కేటాయించారు. మరోవైపు జిల్లా పరిషత్‌కు 5కోట్ల 75వేల 148 రూపాయలు ఆర్థిక సంఘ నిధులు కేటాయించారు. జడ్పీలో వివిధ అభివృద్ధి పనులకు ఈ నిధులను కేటాయిస్తారు. అలాగే ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 48 మండలాలకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం రెండో విడత నిధులు 5కోట్ల ఒక లక్షా 52వేల 78 రూపాయలు కేటాయించారు.

7,613 మెట్రిక్ టన్నుల ఇసుక సరఫరా

- మైనింగ్ డీడీ రవికుమార్

ఏలూరు సిటీ, ఆగస్టు 24 : జిల్లాలో శనివారం మూడు బుకింగ్ సెంటర్ల ద్వారా 1,526 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేసినట్టు మైనింగ్ డీడీ పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడు బుకింగ్ సెంటర్లలో 86 ఆర్డర్లు నమోదు కాగా అన్నింటికీ ఇసుక సరఫరా అయిందన్నారు. జిల్లాలో ఇంతవరకు మొత్తం 7,613 మెట్రిక్ టన్నుల ఇసుక వినియోగదారులకు సరఫరా చేసినట్టు తెలిపారు. ఇబ్రహీంపేట స్టాక్ పాయింట్ వద్ద మెట్రిక్ టన్నుకు రూ.210, చేబ్రోలు పాయింట్ వద్ద రూ.538, వింజరం పాయింట్ వద్ద రూ.362లకు ఇసుకను సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ఇసుక సరఫరాపై ర్యాండమ్‌గా 15 మంది వినియోగదారులకు ఫోన్ చేయగా నూరుశాతం సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. గ్రీవెన్స్‌కు ఒక ఫిర్యాదు అందగా పరిష్కరించినట్టు పేర్కొన్నారు.

పిల్లలను చీకటి రూముల్లో ఉంచుతారా ?

బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకులం నిర్వహణపై జేసీ, ఐటీడీఏ పీవో ధాత్రిరెడ్డి ఆగ్రహం..



గురుకులంలో జ్వరంతో బాధపడుతున్న బాలికను పరామర్శిస్తున్న జేసీ

బుట్టాయగూడెం, ఆగస్టు 24 : 'అనారోగ్యంతో బాధపడుతున్న పిల్లలను చీకటికొట్టం లాంటి సిక్ రూముల్లో ఉంచుతారా?.. మరోసారి పునరావృతమైతే చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వ వసతి గృహాల్లో నివాసం ఉంటున్న విద్యార్థుల పట్ల అధికారులు, ప్రిన్సిపాళ్లు, హెచ్ఎంలు, వార్డెన్లు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు' అంటూ జేసీ, కేఆర్‌పురం ఐటీడీఏ పీవో పి.ధాత్రిరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పీవోగా బాధ్యతలు చేపట్టాక తొలిసారిగా బూసరాజుపల్లి గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలలను శనివారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీచేశారు. గురుకులంలోని విద్యార్థినులు జ్వరాలు బారిన పడుతున్నా గురుకులం ప్రిన్సిపాళ్లు, సిబ్బంది సరిగా పట్టించుకో వడం లేదని తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో జేసీ ఆకస్మిక తనిఖీ చేశారు. తనిఖీలో పలు లోపాలను గుర్తించిన ఆమె తక్షణం అపరిశుభ్రత ప్రదేశాలను, సక్రమంగా పనిచేయని పనిముట్లను బాగు చేయించి అందుబాటులోకి తేవాలని డీడీని ఆదేశించారు. భోజనశాలను, ఆహార పదార్థాలను, వాటర్ ప్లాంటు, వాష్‌రూమ్, సిక్ రూమ్ ఇతర ప్రదేశాలను పరిశీలించారు. సిక్ రూమ్ చీకటిగా ఉండడాన్ని గుర్తించిన జేసీ ఇటువంటి రూముల్లో పిల్లలను ఎలా ఉంచుతున్నారని ప్రశ్నించారు. పరిశుభ్రత లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన పదార్థాలనే పిల్లలకు పెట్టాలన్నారు. శానిటేషన్ లేకపోవడాన్ని ప్రశ్నించారు. ఇంటివద్ద కూడా ఇలానే ఉంటారా అని సిబ్బందిని నిలదీశారు. అధికారులు, సిబ్బంది పద్ధతి మార్చుకో వాలని హెచ్చరించారు. గురుకులంలో వైద్యశిబిరం నిర్వహించి పిల్లలకు వైద్యపరీక్షలు జరపగా 16 మంది సీజనల్ జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి మందులు పంపిణీ చేశారు. ఏపీవో, డీడీ నాయుడు, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టరు జె.సురేష్ కుమార్, ఏటీడబ్ల్యూవో శ్రీవిద్య,డీవైఈవో నీల య్య, డాక్టరు సాల్మ, ఏఎంవో శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా జ్వరాలే

సీతారామనగరంలో 40 మందికిపైగా జ్వర పీడితులు



జ్వర పీడితులు ఆంజనేయులు.. స్వర్ణలత

కుక్కునూరు, ఆగస్టు 24 : శివారు గ్రామమైన సీతారామనగరాన్ని విష జ్వరాలు వణికిస్తున్నాయి. జ్వరంతోపాటు కీళ్లనొప్పులు, గొంతు నొప్పి, జలుబు, విపరీతమైన దగ్గుతో అనారోగ్యం బారిన పడుతున్నారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు మలేరియా పరీక్షలు, రక్త పరీక్షలు, షుగర్ టెస్టులు చేస్తూ జ్వరం తగ్గడానికి పారసిట్మాల్, యాంటీబయోటిక్ టాబ్లెట్లు ఇస్తున్నా జ్వరాలు అదుపులోకి రావడం లేదు. దీంతో జ్వర పీడితులంతా బూర్గంపాడు ప్రభుత్వాస్పత్రికి, భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రులకు తరలి వెళ్తున్నారు. గ్రామంలో ఇంటికి ఒకరు జ్వర పీడితులున్నారు. ఒకే కుటుంబానికి చెందిన గంగాదరి లక్ష్మి, రామకృష్ణ, ముత్తయ్య, పున్నమ్మ, ఆంజనేయులు జ్వరాలతో బాధపడుతున్నారు. వీరిలో ఆంజనేయులు(8)కు భద్రాచలంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం చేయించి ఇంటికి తీసుకొచ్చారు. స్వర్ణలత అనే



జ్వరపీడితులకు సీపీఐ నాయకుల పరామర్శ

యువతి భద్రాచలంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లగా అక్కడ బెడ్‌లు ఖాళీ లేకపోవడంతో వైద్యులతో మందులు రాయించుకుని ఇంటికి వచ్చి ఆర్ఎంపీతో వైద్యం చేయించు కుంటోంది. కాకాని నరసింహారావు, కనికంటి రామారావు, కనికంటి అమర్‌లు జ్వరాలతో ఉన్నారు. సీతారామనగరం గ్రామానికి ఐదు కిలోమీటర్ల దూరంలోని బూర్గంపాడు ప్రభు త్వాస్పత్రికి వైద్యం కోసం జ్వరపీడితులు తరలి వెళ్తున్నారు. నీరసం తగ్గడానికి అక్కడే సెలైన్ బాటిల్ ఎక్కించుకుని సాయంత్రానికి ఇళ్లకు తిరిగి వస్తున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ కాలనీల్లో జ్వరాలు ఎక్కువగా ఉన్నాయి. భద్రాచలంలోని ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లి వైద్యం కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు డబ్బులు లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదిలా ఉండగా శనివారం సీపీఐ మండల కార్యదర్శి మహిశాక్షి వెంకటాచారి, కొన్నే లక్ష్మయ్య, బాబురావు, మేడిపల్లి రమణయ్య గ్రామాన్ని సందర్శించి జ్వరపీడితులను పరామర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం రోజులుగా ప్రజలు జ్వరాలతో బాధ పడుతున్నా కనీసం వైద్యశిబిరం ఏర్పాటు చేయలేదని, ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రశ్నపత్రం లీకైందో..క్రిమినల్ చర్యలే !

27నుంచి 'సాంప్-1' పరీక్షలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 24 : యూనిట్/ఫార్మేటివ్ పరీక్షల స్థానే సెల్ఫ్ అసెస్‌మెంట్ మోడల్ పేపర్ (సాంప్)గా పేరు, విధి విధానాలు మార్చి నిర్వహించనున్న పరీక్షలను ఈనెల 27నుంచి సెప్టెంబరు 4వరకు జిల్లాలోని 1995 ప్రభుత్వ ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నతపాఠశాలల్లో జరపడానికి జిల్లా విద్యాశాఖ ఏర్పా ట్లను పూర్తిచేసింది. ఒకటో తరగతి నుంచి 5వ తరగతి వరకు ఆయా తేదీల్లో ఉదయం 10.45 నుంచి 11.45 గంటల వరకు, 9, 10 తరగతులకు ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, 6-8 తరగతులకు మధ్యాహ్నం 1.30 నుంచి 2.30 గంటల వరకు 'సాంప్-1' పరీక్షలు నిర్వహించనున్నారు. గతంలో ఈ పరీక్షలను ప్రైవేటు పాఠశాలలకు నిర్వహించగా, కోర్టు ఆదేశాలతో ఇకపై ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మాత్రమే సాంప్ పరీక్షలు జరుగుతాయి. జిల్లాలోని 34 సీబీఎస్ఈ పాఠశాలల్లో ఇప్పటికే పదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లపై ఈ పరీక్షలు జరిగినందున వారిని మినహాయించారు. ఈ పాఠశాలల్లో మిగతా తరగతుల(6-9) విద్యార్థులకు ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలతోనే సాంప్-1 పరీక్షలు నిర్వహిస్తారు. ఆ ప్రకారం సెల్ఫ్ అసెస్‌మెంట్ పరీక్షలను జిల్లాలో 1,60,295 మంది ప్రభుత్వ పాఠశాలల బాలబాలికలకు నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు. ఎక్కడా అవకతవకలకు తావులేకుండా చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై డీఈవో అబ్రహం శనివారం వెబెక్స్ సమావేశాలు నిర్వహించి సూచనలు చేశారు. సాంప్-1 పరీక్షలను లీకేజీలకు తావు లేకుండా పకడ్బందీగా నిర్వహించడానికి అవసరమైన అన్ని భద్రతా చర్యలను విద్యాశాఖ చేపట్టింది. ప్రశ్నపత్రం లీకైతే బాధ్యులపై క్రిమినల్ చర్యలు తీసుకోనున్నారు. మండలాల్లో ఇద్దరు ఎంఈవోలు, ఒక సీనియర్ హైస్కూల్ హెచ్ఎంలతో కూడిన మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. ప్రశ్నపత్రాలు, పరీక్షల సామగ్రిని ఈ కమిటీల పర్యవేక్షణలోనే సరఫరా చేయాలని ఆదేశించారు. ఏ రోజుకారోజు పరీక్ష ముగిసిన వెంటనే ఓఎంఆర్ జవాబుపత్రాల మూల్యాంకనం, విద్యార్థులు సాధించిన మార్కులను సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.

పట్టాలెక్కిన విశాఖ - మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్

నరసాపురం, ఆగస్టు 24 : ఈ ఏడాది జనవరిలో నిలిచిన విశాఖ-మచిలీపట్నం ఎక్స్‌ప్రెస్ రైలు మూడు రోజుల క్రితం తిరిగి పట్టాలెక్కింది. 17219 నెంబర్‌తో నడిచే ఈ రైలు మచిలీపట్నం నుంచి రాత్రి 9.25 గంటలకు బయలుదేరి కైకలూరు, ఆకివీడు, భీమవరం టౌన్ మీదుగా రాత్రి 12 గంటలకు భీమవరం జంక్షన్‌కు వస్తుంది. తణుకు, నిడదవోలు మీదుగా ఉదయం ఎనిమిది గంటలకు విశాఖ చేరుతుంది. తిరిగి 17220 నెంబర్‌తో రాత్రి 10.10 గంటలకు అక్కడ బయలుదేరి మూడు గంటలకు తణుకు, 4.45కు భీమవరం జంక్షన్, 5.13కు భీమవరం టౌన్, 5.30కు ఆకివీడు, ఆరు గంటలకు కైకలూరు చేరుకుని 8.45 గంటలకు మచిలీపట్నం వెళుతుంది. ఈ ఎక్స్‌ప్రెస్‌లో విశాఖ వెళ్లే ప్రయాణీకుల కోసం నరసాపురం నుంచి లింకు డెమో రైలును నడుపుతున్నారు. ఇది నరసాపురంలో రాత్రి 11.10కి బయలుదేరి 11.40కి భీమవరం జంక్షన్‌కు చేరుతుంది. తిరిగి విశాఖ నుంచి వచ్చే ప్రయాణీకుల కోసం భీమవరం జంక్షన్ నుంచి ఉదయం 5.25కి మరో లింకు డెమో రైలు నడుస్తోంది.



యాప్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పార్థసారథి

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం : మంత్రి పార్థసారథి

చింతలపూడి, ఆగస్టు 24: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నామవరం వద్ద నాబార్డు నిధులు రూ.20 కోట్ల వ్యయంతో బోయ గూడెం-సీతానగరం బీటీ రోడ్డు పనులకు సంబంధించి ఆయన శంకుస్థాపన చేశారు. దీంతో పాటు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ రూపొందించిన జనహితం యాప్‌ను కూడా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం ఉపాధిహామీ పథకంలో చేపట్టే రోడ్లతో పాటు ప్రతి నియోజకవర్గానికి 10 నుంచి రూ.20 కోట్లు వ్యయం కాగల ఆర్‌అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేయాలనే లక్ష్యం కూడా ఉందన్నారు. కొన్నిరోడ్లను తీసుకుని పీపీటీ విధానంలో అభివృద్ధి పర్చనున్నట్టు చెప్పారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారి కూడా ఇందులో ఉందన్నారు. పొగాకు రైతుల అభ్యర్థన మేరకు సీలింగ్ లిమిట్ తీసేందుకు కేంద్రంతో మాట్లాడి చర్యలు తీసుకున్నామన్నారు. పామాయిల్ రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామన్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఘంటామురళీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్, జనసేన ఇన్‌ఛార్జ్ మేకా ఈశ్వరయ్య పలువురు నాయకులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్, పాల్గొన్న ఎస్పీ కిషోర్

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, ఆగస్టు 24 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో సెప్టెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఆదేశాల మేరకు జిల్లా జడ్జీలు, ఎస్పీ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ప్రభుత్వ న్యాయవాదులు, జిల్లా కారాగార సూపరింటెండెంట్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులతో సమన్వయ సమావేశం నిర్వహించామన్నారు. కేసులను త్వరితగతిన విచారించడానికి ఉన్న వనరులను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశంపైన చర్చించినట్టు తెలిపారు. సాక్ష్యులుగా ఉన్న ప్రభుత్వ అధికారులు, వారు పనిచేసే స్థానాలను గుర్తించి సమన్లు అమలు చేయడం ద్వారా కేసుల పరిష్కారాన్ని ముందుకు తీసుకు వెళ్ళవచ్చని తెలిపారు. ఖైదీలను ఆన్‌లైన్ ద్వారా ప్రవేశపెట్టడం, సమన్లను ఎన్‌స్టెప్ ద్వారా అమలు చేయడం వల్ల త్వరితగతిన కేసులను పరిష్కరించ వచ్చు నని సూచించారు. జిల్లా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ కేసుల విచారణకు పోలీసు వ్యవస్థ సహకరిస్తుందన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు కృష్ణారెడ్డి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెండవ అదనపు జిల్లా జడ్జి మంగాకుమారి, 8వ అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్, ఏలూరు బార్ అధ్యక్షుడు, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మణరెడ్డి, ప్రభుత్వ న్యాయ వాది బీజే రెడ్డి, జిల్లా కారాగార సూపరింటెండెంట్ స్వామి పాల్గొన్నారు.

తాళాబత్తులకు తెలుగు వెలుగు పురస్కారం



పాలకొల్లు అర్బన్, ఆగస్టు 24: పాలకొల్లుకు చెందిన నాటక రచయిత, నటుడు తాళాబత్తుల వెంకటేశ్వర రావుకు హైదరాబాద్ యువ కళావాహిని సాంస్కృతిక సంస్థ అమరావతి తెలుగు వెలుగు పురస్కారం ప్రదానం చేసింది. ఆంధ్రకేసరి ప్రకాశం పంతులు జయంతి సందర్భంగా శుక్రవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బి.కృష్ణమోహన్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్టు వెంకటేశ్వరరావు శనివారం తెలిపారు.

మూడు నెలలు కావస్తున్నా వైసీపీ బొమ్మలే..!



పోలవరం, ఆగస్టు 24 : వైసీపీ ప్రభుత్వం పోయి మూడు నెలలు గడుస్తున్నా మండలంలో అన్ని పంచాయతీల పరిధిలో గ్రామాలలో మాజీ ముఖ్యమంత్రి, మాజీ ఎమ్మెల్యేల ఫోటోలతో బోర్డులే దర్శన మిస్తున్నాయి. ఈ విషయంపై ఎంపీడీవో శ్రీనుని గ్రామ సభలో పలువురు కూటమి నాయకులు ప్రశ్నిస్తే మండల పరిషత్ నిధులతో ఏర్పాటు చేసిన బోర్డులను మండల పరిషత్ తీర్మానం లేకుండా తొల గించడం కుదరదని, ఉన్నతాధికారుల ఆదేశాలు లేవని చెప్పారు. రాష్ట్రంలో అన్ని మండలాల్లో బోర్డులు మారినా పోలవరం మండలంలో బోర్డులు మారక పోవడం విచారకరమని టీడీపీ సీనియర్ నాయకుడు కుంచే దొరబాబు విమర్శించారు. అధికారుల తీరు మారాలని జిల్లా అధికారులు స్పందించి పాత ప్రభుత్వ బోర్డులు తొలగించి కూటమి అధినేతల ఫొటోలు పెట్టాలని కోరారు.

జయ కృష్ణా.. ముకుందా..మురారి

పాఠశాలల్లో కృష్ణాష్టమి సందడి ముందే వచ్చేసింది. శనివారం వివిధ స్కూళ్లలో వేడుకలు నిర్వహించారు. విద్యార్థులు కృష్ణయ్య గోపికమ్మల వేషధారణలతో అలరించారు. ఆట పాటలతో సందడి చేశారు. చిన్నారులు ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు.



పెనుగొండ భాష్యం స్కూల్‌లో..



రాధా..మనోహరం

నరసాపురం మండలం వేములదీవి గ్రామంలో కృష్ణాష్టమి వేడుకలు పురస్కరించుకుని వైభవ వేంకటేశ్వరస్వామిని రాధా కృష్ణులుగా ప్రత్యేకంగా అలంకరించారు. భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించారు

-నరసాపురం రూరల్



అలంపురం టీబీఆర్ స్కూల్‌లో..





ఏలూరు శర్వాణీ స్కూలులో గోపికల నృత్య ప్రదర్శన



తణుకు మాంటిస్సోరి స్కూల్ సందడి



వేషధారణ పోటీల్లో ఉల్లంపర్రు మాంటిస్సోరి విద్యార్థులు

గోపన్నపాలెం వ్యాయామ కళాశాలలో క్రీడా ప్రాజెక్టు మీట్

దెందులూరు, ఆగస్టు 24: వ్యాయామ విద్యనభ్యసించే విద్యార్థులు ప్రతి క్రీడలోను నియమ నిబంధనలు పూర్తిస్థాయిలో తెలుసుకోవాలని గోపన్నపాలెం గ్రామ మాజీ సర్పంచ్, మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి నారాయణప్రసాద్ అన్నారు. శనివారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ కళాశాల ఆవరణలో క్రీడా ప్రాజెక్టు మీట్-2024 నిర్వహించారు. 100, 200, 800 మీటర్ల పరుగుపందెం, షార్ట్‌పుట్, డిస్కస్‌త్రో, లాంగ్ జంప్, హైజంప్, ట్రిబుల్ జంప్, జావలిన్‌త్రో పోటీలను నిర్వహించారు. బాలుర విభాగంలో డి.వేణు, దేవరాజు, ధ్యాన్‌చంద్, బాలికల విభాగంలో మహాలక్ష్మీ, జయశ్రీ, నందినిలు మొదటి మూడు స్థానాల్లో నిలిచారు. వారికి ప్రశంసాపత్రం, కాంస్య పతకాలను అందజేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ నతానియల్, కళాశాల స్థల దాత చలసాని శ్రీధర్‌బాబు, గ్రామ టీడీపీ అధ్యక్షుడు చింతా సుబ్బారావు, శ్రీను, బొర్రా చందు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





క్రీడాజ్యోతి వెలిగించి ప్రాజెక్టు మీట్ ప్రారంభించిన దృశ్యం.. మొదటి మూడు స్థానాలు సాధించిన క్రీడాకారులతో కళాశాల సిబ్బంది

కవల దూడల జననం



దెందులూరు, ఆగస్టు 24 :దెందులూరు మండలం గాలాయగూడెం పంచాయతీ పరిధిలోని నాగులదేవునిపాడు శివారు గ్రామంలో నారకొండ శ్రీహరి అనే పాడి రైతుకు చెందిన గేదెకు కవల దూడలు పుట్టాయి. పరిసర గ్రామాల రైతులు వచ్చి దూడలను చూసి వెళుతున్నారు.

స్కూల్లో పేలిన కుక్కర్ ..

చింతలపూడి, ఆగస్టు 24: సుబ్బరాజు పాఠశాలలో మధ్యాహ్నం భోజనం తయారు చేసేందుకు కుక్కర్‌లో పప్పు వండుతున్న సమయంలో కుక్కర్ ఒక్కసారిగా పేలింది.వేడివేడి పప్పు హేమ అనే కార్మికురాలిపై పడటంతో స్వల్పగాయాలయ్యాయి. దీనిపై ఎంఈవో జి.రామారావు మాట్లాడుతూ బాధితురాలిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్యం చేయించామని ప్రమాదం తప్పిందన్నారు.

కూలిన పాఠశాల షెడ్డు.. తప్పిన ప్రమాదం



ఉండి ఆగస్టు 24 : వర్షాలకు పాఠశాల పైకప్పు కూలిపోయింది, విద్యార్థులు ఎవరు లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఉండి గ్రామంలోని 1 నుంచి 5వతరగతి వరకు నిర్వహించే క్రిస్టియన్ మైనారిటీ స్కూల్ సిమెంటు రేకుల షెడ్డు పైకప్పు గోడతో సహ కూలిపోయింది. స్కూల్ సమయం కాకపోవడంతో ప్రమాదం తప్పిందని స్థానికులు తెలిపారు.ఎంపిటీసీ రామలింగేశ్వరరావు పరిశీలించి అధికారులకు సమాచారం ఇచ్చారు. మధ్యాహ్న సమయంలో షెడ్డు రేకులు జారి పడడంతో ఒక పాపకు స్వల్పంగా గాయమైంది..



హోరాహోరీగా అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలు

భీమవరం అర్బన్, ఆగస్టు 24 : భీమవరం ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న మెంటే సుబ్బారావు నాగరత్నం మెమోరియల్ సబ్ జూనియర్ అండర్-17 బ్యాడ్మింటన్ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి.ఈనెల 25న సెమీ ఫైనల్స్ జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు.

30న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం

ఏలూరుసిటీ, ఆగస్టు 24: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 30వతేదీన శుక్రవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి ఏలూరు జడ్పీ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ అధ్యక్షతన జరుగుతుందని జిల్లా జడ్పీ సీఈవో సుబ్బారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో నూతనంగా ఎన్నికైన గౌరవ లోక్‌సభ సభ్యులు, శాసనసభ్యులను స్థాయి సంఘాల ఎన్నిక , జిల్లా అధికారులతో వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష ఉంటుందని తెలిపారు.

కోల్‌కతా ఘటనపై ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నిరసన

నూజివీడు టౌన్, ఆగస్టు 24: మౌనాన్ని వీడుదాం..బాధితులకు సంఘీభావంగా నిలిచి దోషులకు కఠిన శిక్ష పడేలా చేద్దాం.. అంటూ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు కోల్‌కతా ఘటనపై ర్యాలీ నిర్వహించారు. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో మానవహారాన్ని నిర్మించారు. వైద్యు రాలిపై జరిగిన హత్యాచారంపై మౌనాన్ని వీడాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

శ్రీవారి క్షేత్రం భక్తులతో కిటకిట



ద్వారకాతిరుమల, ఆగస్టు 24: చిన్న తిరుమలేశుని ఆలయాన్ని శనివారం దాదాపు పదిహేనువేల మంది పైబడి భక్తులు సందర్శించారు. ఉదయం అంతంత మాత్రంగా ఉన్న భక్తులు 11 గంటల నుంచి పెరిగారు. దీంతో అన్ని విభాగాలు భక్తులతో నిండిపోయాయి. ఉచిత దర్శనానికి గంట న్నర పైబడి సమయం పట్టింది. వకుళమాత అన్నప్రసాద భవనానికి వెళ్లి స్వామివారి అన్న ప్రసాదాన్ని భుజించారు.

28 నుంచి లక్ష్మీపురం శ్రీనివాసుని పవిత్రోత్సవాలు

ద్వారకాతిరుమల, ఆగస్టు 24: పురాతన ఆలయంగా ప్రసిద్ధి చెందిన లక్ష్మీ పురంలోని సంతాన వేణుగోపాల జగన్నాథస్వామి ఆలయంలో శ్రీనివాసుని పవిత్రోత్సవాలు ఈనెల 28 సాయంత్రం నుంచి ప్రారంభం కానున్నట్లు ఈవో త్రినాథరావు తెలిపారు. 31 వరకూ నాలుగురోజుల పాటు నిర్వహించనున్నారు. ఏడాది పొడవునా ఆలయంలో తెలిసి తెలియక జరిగిన తప్పుల ప్రాయఃచిత్తం నిమిత్తం ప్రతీ ఏటా వీటిని నిర్వహిస్తారు. 28 సాయంత్రం అంకురార్పణ, 29న పవిత్రాధివాసం, 30న పవిత్రారోపణ, 31న జరిగే శ్రీమహా పూర్ణాహుతితో ఉత్సవాలు పూర్తవుతాయని తెలిపారు.

ఆకివీడు వీవీగిరి కళాశాలకు నాక్ బృందం

స్వర్ణోత్సవాలకు సిద్ధం



ఆకివీడు రూరల్ ఆగస్టు 24 : పశువుల పాక నుంచి పక్కా భవనాలకు ఎదిగి వందలాది మంది జీవితాలలో వెలుగు నింపి 50 వసంతాలు పూర్తి చేసుకుని స్వర్ణోత్సవాలకు సిద్ధ మైన ఆకివీడు వీవీగిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను కేంద్ర ప్రభుత్వ బృందం (నాక్) ఈనెల 29, 30 తేదీలలో పర్యటించనున్నది. పూర్వపు విద్యార్థులు, గ్రామస్థులు, విద్యార్థుల తల్లి దండ్రులతో మమేకమై వివరాలు సేకరి స్తారు. నాక్ గుర్తింపు పొందితే కాలేజీ దశ దిశ మారిపోనున్నది. గ్రామీణ ప్రాంతంలోని పేద విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం కాకూడదనే సంకల్పంతో గాంధేయవాది చింతల పాటి వరప్రసాద మూర్తిరాజు తన తండ్రి బాపిరాజు ధర్మసంస్థ పేరున 1974లో మాజీ రాష్ట్రపతి వరాహగిరి, వెంకటగిరి (వివిగిరి) బీఏ, బీకామ్ కోర్సులతో 60 మంది విద్యార్థులతో పాకలో డిగ్రీ కాలేజీ ఏర్పాటు చేశారు. మొలుగు రఘునాధాచార్యులు పలువురు దాతల సహకారంతో 14 ఎక రాల్లో కళాశాల విస్తరించింది. ప్రస్తుతం బీఏ, బీకాం కోర్సులతో పాటు, బీఎస్సీ, కంప్యూటర్ సైన్స్ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. కాలేజీలో రాష్ట్ర స్కిల్ డవలప్‌మెంట్ సెంటర్, ప్రధానమంత్రి విశ్వకర్మ, స్కిల్ హబ్ ద్వారా విద్యార్థులకు సర్టిఫికెటెడ్ వృత్తి విద్యాకోర్సులు నేర్పుతున్నారు. అధునాతన సౌకర్యాలతో కంప్యూటర్ ల్యాబ్, సైన్స్‌ల్యాబ్, లైబ్రరీ ఏర్పాటు చేశారు. యోగా, మెడిటేషన్ సెంటర్, వాకర్స్‌క్లబ్, లియోక్లబ్, ఎన్ఎస్ఎస్ ఆర్గనైజేషన్‌లున్నాయి. విద్యార్థుల సౌకర్యార్థం ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటు చేశారు.

క్రైం కార్నర్

భూ తగాదా..కొడుకుపై తండ్రి దాడి



క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల, ఆగస్టు 24: భూమి తగాదాలో ఒక వ్యక్తిపై అతని తండ్రి, బావలు, వారి కుమారులు ఇనుప రాడ్డులతో దాడి చేశారు. తీవ్ర గాయాలైన అతడిని ద్వారకా తిరుమల పీహెచ్‌సీకి తరలించి అనంతరం మెరుగైన చికిత్స కోసం ఏలూరుకు పంపారు. కోడి గూడెంలో జరిగిన ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దౌలూరి కాంత య్యకు తన కుమారుడు ధర్మారావుతో పొలం విషయంలో కొంత కాలంగా తగాదా ఉంది. తన కుమార్తెలు, అల్లుళ్లు, మనవళ్లను ఇంటికి పిలిపించాడు. శనివారం మధ్యాహ్నం కుమారుడు ధర్మా రావుపై అతని తండ్రి, బావలు డేవిడ్‌రాజు, దాసరి గంగరాజు అతని కుమారులు సుందరరావు, వంశీలు ఇనుప రాడ్డులతో దాడి చేశారు. దీంతో భయపడిన ధర్మారావు భార్య, పిల్లలు పారి పోయి ద్వారకాతిరుమల పోలీ సులను ఆశ్రయించారు. పోలీసులు బాధి తుడిని ముందుగా ద్వారకాతిరుమల పీహెచ్‌సీకి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. దాడిచేసిన ఐదుగురుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వివాహిత మృతి

పెదపాడు, ఆగస్టు 24 : శుభకార్యానికి వెళ్లి భర్తతో కలిసి మోటారు సైకిల్‌పై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మరో మోటారుసైకిల్ ఢీకొన్న ఘటనలో తీవ్ర గాయాలపాలై వివాహిత మృతి చెందిన ఘటన పెదపాడు మండలం అప్పనవీడులో శనివారం చోటు చేసుకుంది. పెదపాడు మండలం సత్యవోలు శివారు కొత్తూరుకు చెందిన వెంకట మహాలక్ష్మి (60) భర్త కోట్రప్రోలు ఉమామహేశ్వరరావుతో కలిసి హనుమాన్ జంక్షన్ వెళ్లి తిరిగి వస్తుండగా అప్పనవీడు పంచాయతీ తాళ్లమూడి వద్ద వెనుక నుంచి మరో మోటారుసైకిల్ ఢీకొంది. ప్రమాదంలో మహాలక్ష్మి తీవ్రగాయాలపాలై అక్కడి కక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న పెదపాడు పోలీసులు మృతదేహాన్ని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్‌పై నుంచి పడి ఒకరికి గాయాలు

ఏలూరు క్రైం, ఆగస్టు 24 : మోటారు సైకిల్‌పై వెళ్తున్న ఒక వ్యక్తి ప్రమాదవశాత్తు అదుపు తప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే హైవే పెట్రోలింగ్ పోలీసులు క్షతగాత్రుని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జంగారెడ్డి గూడేనికి చెందిన చిడిపి కల్యాణ్‌బాబు (27) పల్సర్ మోటారు సైకిల్‌పై పెనుగొండ నుంచి ఏలూరు వైపు వస్తున్నాడు. మార్గ మధ్యలో భీమడోలు అయ్యప్పస్వామి గుడి ఎదురుగా రోడ్డు సరిగా లేక పోవడం వల్ల మోటారు సైకిల్ అదుపుతప్పి శనివారం ఉదయం పడి పోయాడు. తీవ్ర గాయాలకు గురై పడిపోయి ఉన్నట్లు హైవే పెట్రోలింగ్ వాహనానికి సమాచారం అందింది. దీంతో హైవే పోలీసులు హుటాహుటిన క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై ఆసుపత్రి ఔట్ పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు.

గుర్తుతెలియని వాహనం ఢీ.. అపస్మారక స్థితిలోకి యువకుడు



ఏలూరు క్రైం, ఆగస్టు 24: బులెట్‌పై వెళ్తున్న ఒక వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలకు గురై అపస్మారక స్థితిలోకి వెళ్ళి పోయాడు. ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుపత్రి వంతెన కింద భాగంలో బులెట్‌పై (ఏపీ 31డిహెచ్ 7142) వెళ్తున్న వ్యక్తిని గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న ఏలూరు హైవే పెట్రోలింగ్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి 108లో క్షతగాత్రుడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వివరాలు తెలియాల్సి ఉంది. క్షతగాత్రుడు అపస్మారక స్థితిలో ఉన్నాడు

చికిత్స పొందుతూ యువకుడి మృతి

పెదపాడు, ఆగస్టు 24 : మద్యంలో మంచినీరు అనుకుని బొద్దింకల మందు కలుపుకుని తాగి తీవ్ర అస్వస్థతకు గురై చికిత్స పొందుతూ యువకుడు మృతి చెందిన ఘటనపై పెదపాడు పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. పెదపాడు మండలం వసంతవాడ గ్రామానికి చెందిన పోలగాని వెంకటసాంబశివరావు (26) తోపుడు బండిపై హనుమాన్ జంక్షన్‌లో పండ్ల వ్యాపారం చేస్తూ తల్లితో కలిసి జీవనం సాగిస్తున్నాడు. ఆరోగ్యం బాగోలేదని తల్లి వరలక్ష్మి 20 రోజుల క్రితం కుమార్తె వద్దకు వెళ్లింది. సాంబశివరావు 23వ తేదీన బొద్దింకల మందును మంచినీరు అనుకుని మద్యంలో కలుపుకుని తాగాడు. ఈ విషయం చుట్టుపక్కల వారికి తెలియజేయగా వారి సాయంతో తొలుత హనుమాన్ జంక్షన్, మెరుగైన చికిత్స నిమిత్తం విజయవాడ తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్సై కె.శుభశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ వివాదం

పెళ్లికి సహకరించాడని యువతి తరపు బంధువుల దాడి



వివరాలు తెలుసుకుంటున్న పోలీసులు

జంగారెడ్డిగూడెం, ఆగస్టు 24 : ప్రేమించిన వాడితో పారిపోయి పెళ్లి చేసుకునేందుకు సహ కారం అదించాడనే కోపంతో యువతి బంధు వులు మందపాటి రాజు, అతని కుటుంబ సభ్యులపై సుమారు 40 మంది మూకుమ్మడిగా కర్రలతో దాడి చేసిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం మైసన్నగూడెంలో శనివారం సంచలనం రేపింది. జంగారెడ్డి గూడెం మండలం అక్కంపేటకి చెందిన పారేపల్లి జాహ్నవి, ఆమె ఇంటి పక్కనే ఉంటున్న గణేష్‌లు ప్రేమించున్నారు. వీరిద్దరిది ఒకే సామాజిక వర్గం. గత ఆగస్టు 15న ఇద్దరూ ఇంటి నుంచి వెళ్ళిపోయి భద్రాచలం రాముడి సన్నిధిలో పెళ్లి చేసుకున్నారు. అయితే తమ కుమార్తెకు గణేష్‌తో వివాహం చేయడంలో గణేష్‌కు వరుసకు బావ అయిన మంద పాటి రాజు మధ్యవర్తిగా వ్యవహరించాడన్న అనుమానంతో శనివారం మైసన్నగూడెం గ్రామానికి సుమారు నలభై మంది ద్విచక్ర వాహనాలు, కార్లతో రాజు ఇంటికి వెళ్లారు. జాహ్నవి ఎక్కడుందో చెప్పాలంటూ వైసీపీకి చెందిన అక్కంపేట సర్పంచ్ పారేపల్లి నాగేంద్ర, నాగార్జున, కొప్పుల శ్రీను, మణికే నాగేశ్వరరావు, బల్లే విజయ్, సులకాని నాగబాబు మరికొంతమంది రాజు, అతని తల్లి కనకదుర్గ, గణేష్ తల్లి శశిరేఖలపై దాడి చేసి కర్రలతో కొట్టారని బాధితులు తెలిపారు. కనక దుర్గపై బాటిళ్ళతో తెచ్చుకున్న పెట్రోలు పోసి చంపుతామని బెదిరించారని తమ కారును కూడా ధ్వంసం చేశారని బాధితుడు రాజు తెలిపాడు. గ్రామస్థులు అడ్డుకుని గాయపడిన ముగ్గురిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఇదిలా ఉంటే రాజు అతని కుటుంబ సభ్యులపై జరిగిన దాడిని తెలుసుకున్న గణేష్, జాహ్నవి ఒక వీడి యోను వాట్సప్‌లో పోస్ట్ చేశారు. "తమ వివాహం ఇష్ట ప్రకారం జరి గిందని మా గురించి ఎవరినీ ఇబ్బంది పెట్టవద్దని" పురుగుమందు డబ్బా పట్టుకుని ఆత్మహత్యాప్రయత్నం చేశారు. ఆసుపత్రిలో బాధితులను డీఎస్పీ రవిచంద్ర పరామర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు..ఇప్పటికే ఈ ఘటనకు సంబంధించి సర్పంచ్ నాగేంద్రతో పాటు మరో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. ఆసుపత్రి వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సీఐ రాజేష్, ఎస్ఐ షేక్ జబీర్ పర్యవేక్షించారు.

పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే అన్న క్యాంటీన్లు


అన్న క్యాంటీన్‌లో ఆహార పదార్థాలను రుచి చూస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే తదితరులు

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 24: పేదలకు పట్టెడన్నం పెట్టేందుకే కూటమి ప్రభుత్వం అన్న క్యాంటీన్లను పునరుద్ధరించిందని ఎంపీ పుట్టా మహేష్‌కుమార్, ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) అన్నారు. ఆర్‌ఆర్ పేట శ్రీవేంకటేశ్వర స్వామి గుడి వద్ద ఉన్న అన్న క్యాంటీన్లను శనివారం ఎమ్మెల్యే, ఎంపీలు సందర్శించారు. అక్కడ ప్రజలతో కలిసి అల్పాహారం స్వీకరించారు. క్యాంటీన్‌లో ఆహార పదార్థాలు ఎలా ఉన్నాయని వచ్చిన వారిని అడిగి తెలుసు కున్నారు. అనంతరం వారు ఇరువురు మాట్లాడుతూ త్వరలో జంగారెడ్డిగూడెంలో కూడా అన్న క్యాంటీన్ ప్రారంభి స్తామన్నారు. జనసేన ఉమ్మడి జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి అప్పలనాయుడు, ఎంఆర్‌డీ బలరామ్, ఎస్‌ఎంఆర్ పెదబాబు, దాసరి ఆంజనేయులు, చోడే వెంకట రత్నం, తదితరులు పాల్గొన్నారు. టీడీపీ సీనియర్ నాయకులు ఆర్‌ఎస్‌ఆర్ నాగేశ్వరరావు, దాకారపు రాజేశ్వరరావు అన్న క్యాంటీన్‌కి చెరో రూ.50 వేలు విరాళం ప్రకటించారు.

జగ్జీవన్‌రామ్ కృషి మరువలేనిది : చింతమనేని


జగ్జీవన్‌రామ్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని

దెందులూరు, ఆగస్టు 24 : దేశంలో వెనుకబడిన వర్గాల అభివృద్ధి, సంక్షేమానికి సామాజిక న్యాయానికి మాజీ ఉప ప్రధాని డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ చేసిన సంస్కరణలు ప్రజలు మరువలేరని ఎమ్మెల్యే చింత మనేని ప్రభాకర్ అన్నారు. గాలాయగూడెం పంచాయతీ పరిధిలో శనివారం జగ్జీవన్‌రావు విగ్రహాన్ని కూటమి, దళిత సంఘం నేతలతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు మండల టీడీపీ అధ్యక్షుడు మాగంటి మిల్లుబాబు, తెలుగు యువత అధ్యక్షుడు మోతుకూరి నాని, నియోజకవర్గ క్లస్టర్ ఇంచార్జి కొండయ్యచౌదరి, తదితరులు పాల్గొన్నారు.

● పెదవేగి : ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలు పటిష్టంగా అమలు జరిగేలా ఎస్‌ఎంసీ సభ్యులు నిత్య పర్యవేక్షణ ఉండాలని, అప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. కూచింపూడికి చెందిన పాఠశాలల ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను దుగ్గిరాల కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ప్రభాకర్ ఎస్‌ఎంసీ కమిటీ సభ్యులకు పలు అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఆయన మాట్లాడుతూ పార్టీ నాయకులు బొప్పన సుధాకర్, తాతా సత్యనారాయణ, రామానుజం వెంకటేశ్వరరావు, గిత్తా సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఇష్టపడి చదవాలి : ఎమ్మెల్యే బాలరాజు


ఫ్రెషర్స్ డే లో పాల్గొన్న ఎమ్మెల్యే బాలరాజు

జీలుగుమిల్లి, ఆగస్టు 24 : విద్యార్థులు ఇష్టపడి చదవాలని పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అన్నారు. బర్రింకలపాడు ఏపీ గిరిజన బాలుర గురుకుల కళాశాల ఫ్రెషర్స్ డే లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పాల్గొని ప్రసంగించారు. సమీప గురుకుల పాఠశాల్లో విద్యార్థుల వసతి సౌకర్యాలపై ఆరా తీశారు. జనసేన పార్టీ నాయకుల సాయంతో తరగతి గదుల్లో ఫ్యాన్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యేను కళాశాల యాజమాన్యం సన్మానించింది. విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు, దుప్పట్లు అందజేశారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శులు కరాటం సాయి, గడ్డమణుగు రవికుమార్, మండల పార్టీ అధ్యక్షులు పసుపులేటి రాము, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు కొండపల్లి ప్రసాద్, ప్రిన్సిపాల్ చంద్రశేఖ రశర్మ, స్వామి, అధ్యాపకులు విద్యార్థులు, తల్లిదండ్రులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు దూరం

పెదవేగి, ఆగస్టు 24 : ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గుతాయని సహాయ రవాణాశాఖాధికారి ఎస్.జగదీష్ అన్నారు. జానంపేటలోని డ్రైవింగ్ టెస్టింగ్ ట్రాక్ దగ్గర డ్రైవింగ్ లైసెన్స్ కోసం వచ్చిన వారికి పరీక్షలు నిర్వహించి, ట్రాఫిక్ నిబంధనలు, అనుసరించాల్సిన విధానాలపై అవగాహన కల్పించారు. హెల్మెట్, కార్లలో సీట్‌బెల్టు ధరించి మాత్రమే ప్రయాణం చేయాలని చెప్పారు. నిబంధనలు అతిక్రమించి ప్రయాణించే వారిపై కేసులు నమోదు చేస్తామని, జరిమానాతోపాటు జైలు శిక్ష కూడా విధించే అవకాశం ఉందని ఆయన హెచ్చరించారు. వాహనం నడిపే సమయంలో మనతోపాటు ఎదుటివారి కుటుంబాలను దృష్టిలో పెట్టుకుని, వాహనం నడపాలని జగదీష్ సూచించారు.

● ఏలూరు క్రైం : నగరంలో శనివారం సాయంత్రం ఆకస్మికంగా పోలీసులు వాహనాల తనిఖీలు చేపట్టారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో త్రీ టౌన్ సీఐ కె.శ్రీనివాసరావు, టూటౌన్ సీఐ వైవీ రమణ వారి సిబ్బందితో నగరంలో వాహనాల తనిఖీ చేపట్టి ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారికి జరిమానా విధించారు. నిబంధనలకు విరుద్ధంగా నడిపితే సహించేది లేదని హెచ్చరించారు. వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు.

మిషన్ వాత్సల్యతో ఆర్థిక తోడ్పాటు

పెదపాడు, ఆగస్టు 24 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తగా మిషన్ వాత్సల్య ద్వారా నిరాధరణకు గురైన చిన్నారులకు ఆర్థిక తోడ్పాటు అంద జేయడం జరుగు తుందని పెదపాడు ప్రాజెక్టు సీడీపీవో విజయలక్ష్మి తెలిపారు. ప్రాజెక్టు పరిధిలో ఉన్న 41 మంది చిన్నారులకు సంబంధించి ఉపకార వేతనాలను ప్రభుత్వం విడుదల చేయడంతో అందుకు సంబంధించి బాల బాలికలకు, వారి సంరక్ష కులకు అవగాహన కార్యక్రమాన్ని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం నిర్వహించారు. ఎంఈవో దేవినేని వెంకటరమణ, సెక్టారు సూపర్‌వైజర్లు ఫాతిమా, కుమారి పాల్గొన్నారు.

చెరువు ఆక్రమణలు తొలగించాలని వినతి

చింతలపూడి, ఆగస్టు 24: మండలంలోని మేడవరపు చెరువు ఆక్రమణలు తొలగించి భూగర్భ జలాలు చెరువులో నీటిసామర్థ్యం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని, నామవరం బీటీ రోడ్డు శంకుస్థాపనకు వచ్చిన మంత్రి కొలుసు పార్థసారథికి వెంకటాపురం మాజీ సర్పంచ్ ఆదిసత్యనారాయణ వినతిపత్రం అందజేశారు. ఈ చెరువు విస్తీర్ణం 336 ఎకరాలు కాగా, ఆయకట్టు 700 ఎకరాలు సాగు భూమి ఉందని, నీటి పారుదలశాఖ అధికారుల అవినీతి వల్ల చెరువు కళంగి ఎత్తు తగ్గించడంతో నిల్వ సామర్థ్యం తగ్గిపోయిందన్నారు. అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదని, మంత్రి దృష్టికి తెస్తూ వినతిపత్రాలను అందజేశారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్‌ఐలు

టి.నరసాపురం, ఆగస్టు 24: నూతన ఎస్‌ఐగా ఎం.జయబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు.

● జంగారెడ్డిగూడెం : ఎస్‌ఐగా షేక్ జబీర్ బాధ్యతలు చేపట్టారు. ఉమ్మడి కృష్ణా జిల్లా నూజివీడు, కాకినాడ జిల్లా గొల్లపాలెం స్టేషన్‌లలో ఎస్‌ఐగా పని చేసి బదిలీపై ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు.

పోలవరం సీఐగా బాల సురేష్ బాబు

పోలవరం ఆగస్టు 24 : పోలవరం సర్కిల్ ఇనస్పెక్టర్‌గా బాల సురేష్ బాబు బాధ్యతలు స్వీకరించినట్లు ఎస్‌ఐ పవన్ కుమార్ శనివారం తెలిపారు. ఇప్పటి వరకూ సీఐగా పని చేసిన జి.మధుబాబు బదిలీపై వెళ్ళగా తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లి నుంచి సురేష్‌బాబు పోలవరం బదిలీపై వచ్చారు.

బియ్యం దుకాణాల్లో తనిఖీలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 24 : స్థానిక వన్ టౌన్‌లోని పలు బియ్యం దుకాణాలలో శనివారం తూనికలు, కొలతల ఇనస్పెక్టర్ ప్రశాంత్‌కుమార్ ఆధ్వర్యంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. బియ్యం బ్యాగ్‌పై 26 కేజీలు అని ముద్ర ఉండగా వాటిని అధికారులు కొలతలు నిర్వహించగా 25 కేజీలే ఉండడంతో ఆయా షాపులపై అధికారులు కేసులు నమోదు చేశారు.

మోటారు సైకిల్ చోరీపై కేసు

ఏలూరు క్రైం, ఆగస్టు 24: తెల్లవారుజామున జాతీయ రహదారిపై మోటారు సైకిల్ అపహరించిన ఘటనపై ఏలూరు రూరల్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు మేరకు రాజమండ్రికి చెందిన మనుపాటి విజయ్‌కుమార్ పెయింట్ పనుల నిమిత్తం ఈ నెల 15వ తేదీ తెల్లవారుజామున తన మోటారు సైకిల్‌పై విజయవాడ వెళ్తుండగా చోదిమెళ్ల వద్ద ఆగిపోయింది. అదే సమయంలో అటుగా ఒకే మోటారు సైకిల్ పై వచ్చిన నలుగురు వ్యక్తులు విజయ్‌కుమార్ వద్ద ఉన్న సెల్‌ఫోన్, నగదు లాక్కోడానికి ప్రయత్నించగా అతడు పారిపోయాడు. కొద్దిసేపటి తరువాత వచ్చి చూడగా మోటారు సైకిల్ కనిపించలేదు. దానికి కోసం వెతికినప్పటికీ దొరకకపోవడంతో శనివారం రాత్రి ఏలూరు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో నలుగురి వ్యక్తులపై పోలీసులు రోబరీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

తస్మాత్ జాగ్రత్త

- శిథిలమైన జిల్లా కేంద్ర గ్రంథాలయం
- భయభ్రాంతులకు గురవుతున్న పాఠకులు
- నూతన భవనం నిర్మించాలని వేడుకోలు


శిథిలమైన గ్రంథాలయంలో పుస్తక పఠనం చేస్తున్న పాఠకులు



అధికారులు ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

"గ్రంథాలయ భవనం శిథిలావస్థలో ఉన్నందున్న పాఠకులు జాగ్రత్త వహించగలరు" ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం వద్ద ఒక ఫ్లెక్సీ ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు అధికారులు. మేము చెప్పాల్సింది చెప్పాం.. రేపో మాపో బిల్డింగ్ కూలి ప్రమాదం జరిగితే మా బాధ్యత లేదన్నట్టుంది అధికారుల తీరు.

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 24: గ్రంథాలయాలు విజ్ఞాన బాండాగారాలు, ఎందరో మహానుభావులు గ్రంథాలయాల్లో చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించారు. ఎంతో మంది ఐఏఎస్, ఐపీఎస్, గ్రూప్-1 అధికారులు గ్రంథలయాల్లో చదువుకున్నవారే. ఎమ్మెల్యే, ఎంపీలు, మంత్రులుగా కూడా అయ్యారు. అటువంటి గ్రంథాలయాలు నేడు నిరాదారణకు గురి కావడం పాఠకులను తీవ్ర నిరాశకు గురి చేస్తుంది. ఇప్పటికి కూడా వేలాది మంది పేద విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతీ రోజు గ్రంథాలయానికి వెళ్తూ భవిష్యత్తుకు బాటలు వేసుకుంటున్నారు. అటువంటి గ్రంథాలయాలను కాపాడుకోవల్సిన బాధ్యత సమాజం, ప్రభుత్వంపై ఉంది. ఏలూరు జిల్లా కేంద్ర గ్రంథాలయం నేడు శిథిలావస్థకు చేరుకుంది. గ్రంథాలయాధికారులు కూడా గ్రంథాలయం శిథిలావస్థలో ఉందని గోడలకు బోర్డులు పెట్టారు. గ్రంథాలయ భవనం ఎప్పుడైన కూలిపోయే పరిస్థితులో ఉంది. శిథిల భవనంలోనే ఇంకా గ్రంథాలయం నడుస్తుంది. వేరే భవనం మార్చేలోపు పాఠకులకు ఏదైన జరిగితే ఎవరిది బాధ్యతా అంటూ పాఠకులు ప్రశ్నిస్తున్నారు. భయంభయంగా లోపల చదువుకోవల్సి వస్తుందని వాపోతున్నారు. లోపలికి వెళ్ళిన వాళ్ళం మరలా తిరిగోస్తామాలేదా అనే సందేహాలు తలెత్తుతున్నాయి. 40 ఏళ్ల క్రితం ఎటువంటి పిల్లర్స్ లేకుండా సాదాసీదాగా భవనాన్ని నిర్మించారు. ఇప్పుడు అది శిథిలావస్థకు చేరుకుంది. ప్రతీ రోజు 200 - 300 మంది వరకు విద్యార్థులు, నిరుద్యోగులు చదువుకోవడానికి ఇక్కడికి వస్తుంటారు. ఈ 40 ఏళ్ళల్లో వేలాది మంది ఇదే గ్రంథాలయంలో చదువుకుని ఎంతో మంది కలెక్టర్లు, ఎస్పీలు, గ్రూప్ -1 అధికారులు అయ్యారు. అలాంటి గ్రంథాలయం నేడు శిథిలావస్థకు చేరుకోవడం విచారకరం. ఎక్కువగా పేద, బడుగు, బలహీన వర్గాల వారు చదువుకునే గ్రంథాలయాన్ని తాత్కాలికంగా వేరే చోటుకు మార్చి నూతన భవనాన్ని నిర్మించాలని పాఠకులు కోరుతున్నారు.

రామచంద్రపురంలో సీజనల్ జ్వరాలపై సర్వే


ఇంటింటికీ తిరిగి వ్యాధిగ్రస్తులను పరీక్షిస్తున్న విలేజ్ క్లినిక్ సిబ్బంది

ఉంగుటూరు, ఆగస్టు 24 : మండలంలోని నల్లమాడు శివారు రామచంద్రపురం గ్రామానికి చెందిన 19 ఏళ్ల మానసిక వికలాంగుడు ప్లేట్‌లెట్స్ పడిపోవడంతో రాజమహేంద్రవరంలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో గురువారం మృతి చెందాడు. దీంతో విలేజ్ క్లినిక్ వీహెచ్‌ఎస్ అనూష చేబ్రోలు పీహెచ్‌సీ వైద్యాధికారి వర్మ. దృష్టికి తీసుకువెళ్లారు. డాక్టర్ వర్మ శనివారం గ్రామంలో సీజనల్ జ్వరాలపై సర్వే నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి కిషోర్‌బాబు మాట్లాడుతూ గ్రామంలో శానిటేషన్ చేయించడంతో పాటు ఫాగింగ్ జరిపించి దోమల నిర్మూలన చేయిస్తున్నామన్నారు. కాగా సర్పంచ్ గౌతు రాము మాట్లా డుతూ గ్రామంలో సాధారణ జ్వరాలు ఉన్నాయని చనిపోయిన యువకుడు మానసిక వికలాంగుడని తెలిపారు. దీనికి సంబంధించి ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ కేవీ గిరిధర్ మాట్లాడుతూ ఫాగింగ్ యంత్రాలను పంపి గ్రామమంతా దోమల మందు పిచికారీ చేయిస్తున్నామన్నారు.

● హైదరాబాద్‌కు చెందిన మాతృదేవోభవ చారిట బుల్ ట్రస్టు ఆధ్వర్యంలో వైద్యురాలు గుత్తా శ్రీదేవి చేబ్రోలు పీహెచ్‌సీలో శనివారం గర్భిణులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యులు కలిదిండి సుబ్బరాజ వర్మ, శ్రావణ్ రెడ్డి సహకరించారు.

● స్థానిక ఆయుర్వేద వైద్య శాల ఆధ్వర్యంలో రాచూరు హైస్కూల్లో డాక్టర్ కస్తూరి శిరీష సుమారు 190 మంది రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. దీర్ఘకాల వ్యాధులకు ఉచితంగా మందులు అందించారు.

● లింగపాలెం : గ్రామాల్లో పారిశుధ్యం పాటించాలని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. ఆసన్నగూడెంలో డాక్టర్ కృష్ణకిషోర్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు.గ్రామాల్లో పరిశుభ్రత ఉంటేనే వ్యాధులు దరిచేరవన్నారు. వైద్య సిబ్బంది ప్రతిరోజూ గ్రామాల్లో పర్యటిస్తూ గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. దోమ తెరలు వాడాలని, పూల కుండీల్లో వంట గదిలో దోమలు పెరిగే అవకాశం ఉందని డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. పలువురు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● ఏలూరు టూ టౌన్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులను వేగవంతం చేసినట్లు మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ మాలతి తెలిపారు. స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా 30వ డివిజన్ మంచినీళ్ళ తోట, ఏటిగట్టు, మోతేవారితోట ప్రాంతాల్లో పారిశుధ్య పనులు చేపట్టారు. దోమల లార్వా నిర్మూలనకు స్ప్రేయింగ్, ఫాగింగ్, నిల్వ నీటిలో ఆయిల్‌బాల్స్ వేశారు. శానిటరీ ఇనస్పెక్టర్ వేణుగోపాలస్వామి, పప్పు ఉమామహేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ స్టీఫెన్‌రాజు పాల్గొన్నారు.

ఈ-పంట నమోదు తప్పనిసరి

టి.నరసాపురం, ఆగస్టు 24: రైతులు సాగు చేస్తున్న వ్యవసాయ, ఉద్యానవన పంట వివరాలను ఈ-పంటలో నమోదు చేయించుకోవాలని ఏవో బి.సుమలత శనివారం తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో పొలం పాస్‌బుక్ లేదా కౌలుకార్డు, ఆధార్ కార్డు, ఫోన్ నెంబరు నమోదు చేయాలని, నమోదైన రైతులకు ప్రభుత్వం అందించే ఉద్యాన, వ్యవసాయ శాఖల ద్వారా పథకాలు అన్ని ఈ-పంట ఆధారంగానే లబ్ధి పొందుతారన్నారు.

● పెదపాడు : మండలం కొత్తూరు, ముప్పర్రు, పెదపాడు గ్రామాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదు కార్యక్రమాన్ని ఏడీఏ జి.శైలజ శనివారం పరిశీలించారు. ఆయా గ్రామాల్లో జరుగుతున్న ఈ-పంట నమోదు ప్రక్రియను పరిశీలించి సిబ్బందికి సూచనలు చేశారు. ఇచ్చిన గడువు లోగా పంట నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేయాలని రైతు సేవా కేంద్రం సిబ్బందికి తెలిపారు. కార్యక్రమంలో ఏవో ప్రదీప్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

థెరిస్సా మహిళా కళాశాలలో వర్క్‌షాపు

ఏలూరు అర్బన్, ఆగస్టు 24 : 'స్టాటిస్టికల్ విజువలైజేషన్ టూల్‌పవర్ బిఐ' అనే అంశంపై శనివారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో ఒకరోజు వర్క్‌షాపు జరిగింది. కళాశాల విద్య ముగిసిన అనంతరం త్వరితగతిన ఉద్యో గాలు పొందడానికి పవర్ బీఐ సరైన సాధనమని కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామి నేషన్స్ సిస్టర్ సుశీల అన్నారు. స్టాటిన్ ఫెయిర్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ నిపుణు డు శ్రీనివాసరావు మాట్లాడుతూ డేటాను దృశ్య రూపం చేయడానికి పవర్ బీఐ ఉపకరిస్తుందన్నారు. ప్రిన్సిపాల్ సిస్టర్ మెర్సీ, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ మరి యా క్రిస్టియా, అధ్యాపకులు పూజిత జ్యోతి, శ్రావణి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి మరో ఇద్దరు ఎంపిక

ద్వారకాతిరుమల, ఆగస్టు 24: జి.కొత్తపల్లి జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులు కాటుబోయిన దివ్య, దాసరి స్వాతి ట్రిపుల్ ఐటీకి ఎంపికైనట్లు హెచ్‌ఎం లీలాకుమార్ తెలిపారు. ఇంతకు ముందు ఇదే స్కూల్ నుంచి మొదటి లిస్టులో పదో తరగతిలో 600కు 574 మార్కులు తెచ్చుకున్న రాచూరి కృష్ణతేజకు, 573 మార్కులు తెచ్చుకున్న రాచూరి కృష్ణ చైతన్యకు సీట్లు వచ్చాయన్నారు.

హైస్కూల్‌ను సందర్శించిన ఉన్నతాధికారులు

ఉంగుటూరు, ఆగస్టు 24 : కైకరం హైస్కూల్‌ను శనివారం ఎన్‌సీసీ-19 ఆంధ్రా బెటాలియన్(ఏలూరు)కు చెందిన ఉన్నతాధికారులు సందర్శించారు. హెచ్‌ఎం జి.ప్రసాదరావు అధ్యక్షతన ఎన్‌సీసీ ఆఫీసర్ జి.గవరయ్య ఆధ్వర్యంలో కమాండింగ్ ఆఫీసర్ లెఫ్టనెంట్ కల్నల్ అమిత్‌పాండే అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ రిబేష్ సిన్హా పరిశీలించి విద్య, ఉద్యోగ అవకాశాల గురించి వివరించారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెదపాడు, ఆగస్టు 24 : గ్రామంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఖాళీగా వున్న తెలుగు, కామర్స్ సబ్జెక్టులను బోధించుటకు అర్హత గల అతిథి అధ్యా పక పోస్టులకు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లుగా కళాశాల ప్రిన్సిపాల్ ఎం.శ్రీనివాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు అధ్యాపకులు 50 శాతం మార్కులతో ఎంఏ తెలుగు, కామర్స్ అధ్యాపకులు 50 శాతం మార్కులతో ఎంకాం ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ఈ నెల 27వ తేదీ సాయంత్రం నాలుగు గంటలలోపు దరఖాస్తు చేసుకోవాలని, 28వ తేదీ ఉదయం 10 గంటలకు కళాశాలలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామ న్నారు. వివరాలకు సెల్ నెంబర్ 82473 67920లో సంప్రదించాలన్నారు.

స్త్రీల సమస్యలపై నేడు ఉచిత వైద్య శిబిరం

ద్వారకాతిరుమల, ఆగస్టు 24: లయన్స్ క్లబ్, మానవత సంస్థ ఆధ్వర్యంలో ఆర్చిగేటు వద్దనున్న వాసవీ ప్యారడైజ్‌లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకూ ఆదివారం స్త్రీల ఆరోగ్య, సంతాన సాఫల్య సమస్యల కోసం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు సభ్యులు తెలిపారు. ఏలూరుకు చెందిన కృష్ణ ఫెర్టిలిటీ క్లినిక్ వైద్యురాలు రోషిణి స్త్రీలను పరీక్షించి అవసరమైన వారికి ఉచితంగా మందులు, రక్తపరీక్షలు జరుపుతారన్నారు.

యూత్ ఫెస్టివల్ పోటీల విజేతలు వీరే


మారథాన్ పరుగు విజేతలతో డాప్‌క్యూ జిల్లా అధికారులు, పీఈటీలు

ఏలూరు అర్బన్, ఆగస్టు 24 : యువతలో హెచ్‌ఐవీ/ఎయిడ్స్‌పై అవగాహన నిమిత్తం ఏపీ సాక్స్, డాప్‌క్యూ (జిల్లా ఎయిడ్స్ నివారణ, నియంత్రణ సంస్థ) ఆధ్వర్యంలో శనివారం ఏలూరులో యూత్ ఫెస్టివల్ జిల్లా స్థాయి కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు, ట్రాన్స్‌జండర్లకు ఇండోర్ స్టేడియం వద్ద ఐదు కిలోమీటర్ల మారథాన్ పరుగును, ప్రభుత్వ హైస్కూళ్లలో 8, 9 చదువుతున్న విద్యార్థులకు డీఎంహెచ్‌వో కార్యాలయంలో క్విజ్ పోటీలు నిర్వహించారు. మారథాన్ పరుగు పోటీ పురుషుల విభాగంలో మోహనరావు, గంగరాజు, మహిళల విభాగంలో గంగాభవాని, భార్గవి విజేతలుగా నిలిచారు. ట్రాన్స్‌జండర్ల విభాగంలో సింధుపూజ, అప్సర ప్రథమ, ద్వితీయస్థానాల్లో నిలిచారు. క్విజ్ పోటీలో బ్లెస్సీవీణ, పావని, కీర్తన తొలి మూడు స్థానాల్లో నిలిచారు. వీరందరికీ డీఎంహెచ్‌వో కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో నగదు బహుమతులు అందజేశారు. ఈ విజేతలను సెప్టెంబరులో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి యూత్ ఫెస్ట్ పోటీలకు జిల్లా తరపున పంపిస్తామని అదనపు డీఎంహెచ్‌వో(లెప్రసీ, ఎయిడ్స్, టీబీ), జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ నాగేశ్వరరావు వెల్లడించారు. కార్యక్రమలో డీఎస్‌డీవో శ్రీనివాస్, డాప్‌క్యూ జిల్లా మేనేజర్ బాలాజీ, ప్రోగ్రాం మేనేజర్ హరినాథ్ కుమార్, వ్యాయామోపాధ్యాయులు రమేష్, శ్రీనివాస్, ప్రసాద్, నాయుడు, పద్మ, తదితరులు పాల్గొన్నారు.

పోలవరంలో భారీ వర్షం



పోలవరం ఆగస్టు 24 : మండలంలో శనివారం భారీ వర్షం కురిసింది. మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలో పల్లపు ప్రాంతాలు ఇప్పటికే జలమయమయ్యాయి. దీనికి తోడు కురిసిన భారీ వర్షానికి ఆయా ప్రాంతాలలో నీటి నిల్వలు పెరగడంతో ప్రజలకు అవస్థలు పడుతున్నారు. పోలవరంలో బాపూజీకాలనీ, కొత్తపేట, జగన్నాథపేట పట్టిసీమలో వీరభద్రపురం, కొత్తపట్టిసీమ పంచాయతీలో ఏటిగట్టు దిగువన నివాసాలు, గూటాల హైస్కూలు సమీపంలో ఉన్న వీధులు చెరువులను తలపిస్తున్నాయి. పైడిపాక చంద్రన్న పునరావాస కాలనీకి వెళ్ళే రోడ్డు మార్గంలో కొండవాగుల జలాల దాటికి రోడ్లు కోతకు గురై పునరావాస గ్రామ ప్రజలు రాకపోకలు సాగించడానికి ఇబ్బందులకు పడుతున్నారు. పట్టిసీమ ఎత్తిపోతల పథకం నుంచి బంగారమ్మపేట వరకూ, ఇటుల కోట పంచాయతీలో కచేరి మూడు రోడ్ల జంక్షన్‌లో, పట్టిసీమ ఎత్తిపోతల పథకం డెలివరీ ఛానల్ సమీపంలో రోడ్లపై ఉన్న భారీ గోతులలో వర్షపు నీరు చేరి రోడ్డుపై గోతులు కానరాక వాహన దారులు ఇబ్బందులకు గురవుతున్నారు.

కొనసాగుతున్న వర్షాలు

ఏలూరు సిటీ, ఆగస్టు 24 : జిల్లాలో వర్షాలు కొనసాగుతున్నాయి. శనివారం జిల్లాలో మబ్బుల వాతావరణం కొనసాగింది. గడచిన 24 గంటల్లో జిల్లాలోనే అత్యధికంగా కలిదిండి మండలంలో 15.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా సరాసరి వర్షపాతం 2.8 మి.మీ నమోదైంది. వేలేరుపాడులో 12, పెదపాడులో 11.2, ఉంగుటూరులో 5.2 మి.మీ వర్షపాతం నమోదు కాగా జిల్లాలో మిగిలిన వర్షం కురిసిన మండలాల్లో 5 మి.మీ కన్నా తక్కువగానే వర్షపాతం నమోదైంది.

మహిళలపై దాడులను అరికట్టాలి



ఆందోళన చేస్తున్న మహిళలు

బుట్టాయగూడెం, ఆగస్టు 24 : మహిళలపై దాడులను అరికట్టాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో శనివారం మహిళలు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. సీపీఐ పోలవరం నియోజకవర్గ కార్యదర్శి కారం దారయ్య ఆధ్వర్యంలో మండల కేంద్రంలో మహిళలు నెహ్రూబొమ్మ సెంటర్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన సభలో సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు వరకా శ్యామల మాట్లా డుతూ మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు అవగాహన సదస్సులు నిర్వహిం చాలన్నారు. మహిళలకు రక్షణ కల్పిస్తూ 2022లో తీసుకువచ్చిన బిల్లు నేటికి అమలుకు నోచుకో లేదన్నారు. కలకత్తాలో వైద్య విద్యార్థినిపై జరిగిన ఘటనపై సుప్రీం కోర్టు న్యాయమూర్తులతో విచారణ జరిపి కుటుంబానికి న్యాయం చేయాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో తెల్లం వీరమ్మ, గుండి నాగరత్నం, మడకం జగదాంబ, తామా అన్నపూర్ణ, కె.సూర్యచంద్రం, మడకం దుర్గారావు, బి.గంగరాజు, కారం వీరమ్మ పాల్గొన్నారు.

● పెదపాడు : విద్యార్థినులు తమపై జరుగుతున్న లైంగిక దాడుల పట్ల ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని డాక్టరు నిర్మలాదేవి తెలిపారు. పెదపాడు మండలం వట్లూరులోని సర్‌సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో కళాశాల ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నోటు వైలెన్స్ ఎగెనెస్ట్ ఉమెన్ అనే అంశంపై శనివారం అవగాహన కార్యక్రమం జరిగింది. దేశంలో మహిళలపై జరుగుతున్న దౌర్జన్యాలు, దాడులు, వాటి నుంచి ఏవిధంగా రక్షణ పొందాలి, అందుకు అందుబాటులో ఉన్న సాంకేతికతను తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టరు చిత్రమైనేని, డాక్టరు గుండపనేని రోషిణి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు ఆనంద్ రాక

ఏలూరు టూ టౌన్, ఆగస్టు 24: ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు చెల్లం ఆనంద్‌ప్రకాశ్ ఆదివారం ఏలూరు రానున్నారు. జిల్లా పరిషత్ అతిథి గృహంలో ఎస్సీ, ఎస్టీ ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తారు. అనంతరం 10.30 నిమిషాలకు విలేకర్ల సమావేశంలో మాట్లాడుతారు.

రేపటి నుంచి క్రీడా పోటీలు

ఏలూరు రూరల్, ఆగస్టు 24: హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈ నెల 26 నుంచి 31వ తేదీ వరకు జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర క్రీడా ప్రాదికార సంస్థ, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో పలు క్రీడాంశాల్లో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా క్రీడ అభివృద్ధి అధికారి డి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. జిలా వ్యాయామ ఉపాధ్యాయులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, విద్యార్థులను ఆయా క్రీడాంశాల్లో పాల్గొనేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

రేపు శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు

ఏలూరు రూరల్, ఆగస్టు 24: రామకోటి ప్రాంగణంలో సోమవారం శ్రీకృష్ణజన్మాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహిస్తామని, ఏలూరు పట్టణ యాదవసంఘం నాయకులు తెలిపారు. సంఘ భవనలో శనివారం విలేకర్ల సమావేశంలో వేడుకలకు సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ఎం.చింతయ్య మాట్లాడుతూ పట్టణ యాదవ సంఘం, ఇస్కాన్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహిస్తున్నామని, ఏలూరు ఎంపీ పుట్టామహేష్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి హాజరు కానున్నారని తెలిపారు. ఇస్కాన్ టెంపుల్ ప్రతినిధి రాధావల్లభ, ఇ.తాతారావు, పాల్గొన్నారు.

28న విజయవాడలో భూ సదస్సు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 24 : సీపీఐ ఆధ్వర్యంలో ఈ నెల 28న విజయ వాడలో జరిగే భూ బాధితుల రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్య దర్శివర్గ సభ్యులు డేగా ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయ భవనంలో శనివారం భూ బాధితుల రాష్ట్ర సదస్సుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ప్రభాకర్ మాట్లాడుతూ ఏజెన్సీలోని పోలవరం, కుక్కునూరు, వేలేరుపాడు, బుట్టాయిగూడెం ప్రాంతాల్లో 25 ఏళ్లుగా పేదలు సాగు చేసుకుంటున్న పోడు భూములకు పట్టాలు మంజూరు చేసి పంపిణీ చే యాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు బి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

7 నుంచి చవితి మహోత్సవాలు

ఏలూరు కార్పొరేషన్, ఆగస్టు 24 : సత్రంపాడులో గల లక్ష్మీగణపతి స్వామి ఆలయం వద్ద సెప్టెంబర్ ఏడు నుంచి 16వ తేదీ వరకు చవితి మహోత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఈవో సీహెచ్ చిననాగేశ్వరరావు, అర్చకులు ఆర్.రాఘవేంద్ర కుమార్ శర్మ తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు నాక్ బీప్లస్ గ్రేడ్

చింతలపూడి, ఆగస్టు 24: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు బెంగుళూరుకు చెందిన నాక్ టీమ్ బీప్లస్ గ్రేడ్ ఇచ్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. గతంలో ఈ కళాశాలకు ఈ టీమ్ బీగ్రేడ్ మాత్రమే ఇచ్చిందని, ఈ నెల 13,14 తేదీల్లో నాక్ టీమ్ కళాశాలను సందర్శించి ఇచ్చిన నివేదిక ద్వారా బీప్లస్ గ్రేడ్ ప్రకటించిందన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత

భీమడోలు, ఆగస్టు 24 : ఏలూరు ఫీడర్‌లో ఉన్న ప్రస్తుత కండక్టర్ల మార్పు చేసే నేపద్యంలో 25వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకూ వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు రోజూ రెండు విడతలుగా విద్యుత్ సరఫరా చేపడుతుందని ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నటరాజన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 132/33 కేవీ విద్యుత్ ఉపకేంద్రం ఏలూరు పరిధిలోని ఆవారాగూడెం, రామారావుగూడెం, దెందులూరు, పూళ్ళ, సూరప్పగూడెం, గుండుగొలను చెందిన వ్యవసాయ ఇతర విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యుత్ సరఫరాలో మార్పులు

పెదవేగి, ఆగస్టు 24 : 132 కేవీ భీమడోలు పరిధిలోని పెదవేగి ఫీడర్ కండక్టర్(లైను) మార్పు చేస్తున్న కారణంగా విద్యుత్ సరఫరా వేళల్లో మార్పులు చేస్తున్నామని, వినియోగదారులు ఈ సమయాలను దృష్టిలో పెట్టుకుని తదనుగుణంగా వ్యవసాయ పనులు చేసుకోవాలని ఏపీఈపీడీ సీఎల్ (ఆపరేషన్) ఏలూరు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జేపీబీ నటరాజన్ తెలి పారు. పెదవేగి ఫీడర్ పరిధిలోని పెదవేగితోపాటు విజయరాయి, బాపిరాజు గూడెం, అయ్యపరాజుగూడెం, జానంపేట, కూచింపూడి, రామశింగవరం, రాన్న పాలెం, కవ్వగుంట, ఆసన్నగూడెం, ధర్మాజీగూడెం, ముందూరు, గాలాయ గూడెం, చొదిమెళ్ళ, తంగెళ్ళమూడి, గుడిగుంట, జోగన్నపాలెం విద్యుత్ ఉపకేం ద్రాల పరిధిలో వ్యవసాయ విద్యుత్ సరఫరాలో మార్పులు ఉంటాయని ఆయన చెప్పారు. ఈ కారణంగా ఈ నెల 25 నుంచి వచ్చేనెల 3వ తేదీ వరకు వ్యవసాయ విద్యుత్ సరఫరా రెండు దఫాలుగా ఇస్తామని, దీన్ని దృష్టిలో పెట్టుకుని, వ్యవసాయదారులు తదనుగుణంగా వ్యవసాయ పనుల్లో మార్పులు చేసుకుని, సహకరించాలని ఈఈ నటరాజన్ విజ్ఞప్తి చేశారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించండి

ఏలూరు అర్బన్, ఆగస్టు 24 : ఢిల్లీలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ల సభ్యులు వి.రామ్‌చందర్, జతుతో హుస్సేన్‌లను వేర్వేరుగా కలుసుకుని అఖిల భారత తపాలా ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు దాసరి నాగేంద్రకుమార్ వినతిపత్రాలను అందజేశారు. తపాలా శాఖ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సమస్యలు, తదితన వాటిపై వారిని అభ్యర్థించినట్లు శనివారం ఇక్కడి పత్రికలకు విడుదల ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల సంఘ నాయకులు అహిర్వార్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

చింతలపూడి, ఆగస్టు 24: నగర పంచాయతీలోని వెలమపేటలో నివసిస్తున్న వెల్డింగ్ వర్కర్ కుటుంబానికి మండల వెల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో రూ.16,500 నగదు అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు సింగంశెట్టి శివకుమార్ మాట్లాడుతూ యూనియన్ సభ్యుడు పెద్దవరపు ప్రభాకర్ ఇటీవల అనారోగ్యానికి గురికావడం, ఆ కుటుంబం ఆర్థిక ఇబ్బందులు చూసి యూనియన్ సభ్యులు కలిసి ఈ సాయాన్ని అందచేసినట్లు తెలిపారు. యూనియన్ నాయకులు పి.మోహన్‌బాలకృష్ణ, బాలు, బాష, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఆవుదూడను ఢీ కొన్న కారు

ఏలూరు క్రైం, ఆగస్టు 24 : ఆవు తన బిడ్డ(దూడ)తో రోడ్డుపై వెళ్తుండగా ఒక కారు దూడను ఢీకొనడంతో ఆదూడ తీవ్ర గాయాలపాలైంది. ఏలూరు జిల్లా పరిషత్ ఎదురుగా శనివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో ఒక ఆవు తన దూడతో నడిచి వెళ్తుంది. ఒక కారు అతి వేగంగా వచ్చి దూడను ఢీకొని వెళ్ళిపోయింది. ఈ ప్రమాదంలో దూడ తీవ్ర గాయాలకు గురై కొట్టుమిట్టాడుతుంటే తల్లి నాలికతో నాకుతూ పైకి లేపడానికి ప్రయత్నం చేస్తూనే ఉంది. అదే సమయంలో అటుగా వెళ్తున్న కొంత మంది చూసి ఆ దూడను గో సంరక్షణ సమితికి తరలించారు. అయితే ప్రమాదానికి కారణమైన కారును మాత్రం గుర్తించలేకపోయారు. సీసీ పుటేజ్‌ల ఆధారంగా కారును గుర్తించి వాహన దారుడిపై చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సి.పురుషోత్తమ కుమార్, పాల్గొన్న ఎస్పీ కిషోర్

సెప్టెంబరు 14న జాతీయ లోక్ అదాలత్

ఏలూరు క్రైం, ఆగస్టు 24 : ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని అన్ని కోర్టులలో సెప్టెంబరు 14వ తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పురుషోత్తమ కుమార్ చెప్పారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ బి.కృష్ణమోహన్ ఆదేశాల మేరకు జిల్లా జడ్జీలు, ఎస్పీ, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్, ప్రభుత్వ న్యాయవాదులు, జిల్లా కారాగార సూపరింటెండెంట్, ఏలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులతో సమ న్వయ సమావేశం నిర్వహించామన్నారు. కేసులను త్వరితగతిన విచారించడానికి ఉన్న వనరులను ఏ విధంగా వినియోగించుకోవాలనే అంశంపైన చర్చించినట్టు తెలిపారు. సాక్ష్యులుగా ఉన్న ప్రభుత్వ అధికారులు, వారు పనిచేసే స్థానాలను గుర్తించి సమన్లు అమలు చేయడం ద్వారా కేసుల పరిష్కారాన్ని ముందుకు తీసుకు వెళ్ళవచ్చని తెలిపారు. ఖైదీలను ఆన్‌లైన్ ద్వారా ప్రవేశపెట్టడం, సమన్లను ఎన్‌స్టెప్ ద్వారా అమలు చేయడం వల్ల త్వరితగతిన కేసులను పరిష్కరించ వచ్చు నని సూచించారు. జిల్లా ఎస్పీ కిషోర్ మాట్లాడుతూ కేసుల విచారణకు పోలీసు వ్యవస్థ సహకరిస్తుందన్నారు. ఏపీ బార్ కౌన్సిల్ సభ్యుడు కృష్ణారెడ్డి, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా రెండవ అదనపు జిల్లా జడ్జి మంగాకుమారి, 8వ అదనపు జిల్లా జడ్జి సునీల్ కుమార్, ఏలూరు బార్ అధ్యక్షుడు, జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కోనే సీతారామ్, డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ లక్ష్మణరెడ్డి, ప్రభుత్వ న్యాయ వాది బీజే రెడ్డి, జిల్లా కారాగార సూపరింటెండెంట్ స్వామి పాల్గొన్నారు.

రహదారుల అభివృద్ధికి ప్రాధాన్యం : మంత్రి పార్థసారథి

చింతలపూడి, ఆగస్టు 24: రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఏలూరు జిల్లా నామవరం వద్ద నాబార్డు నిధులు రూ.20 కోట్ల వ్యయంతో బోయగూడెం-సీతానగరం బీటీ రోడ్డు పనులకు సంబంధించి ఆయన శంకుస్థాపన చేశారు. దీంతో పాటు నియోజకవర్గ సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ రూపొందించిన జనహితం యాప్‌ను కూడా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం రోడ్ల అభివృద్ధిని నిర్లక్ష్యం చేసిందన్నారు. ప్రస్తుతం ఉపాధిహామీ పథకంలో చేపట్టే రోడ్లతో పాటు ప్రతి నియోజకవర్గానికి 10 నుంచి రూ.20 కోట్లు వ్యయం కాగల ఆర్అండ్‌బీ రోడ్లను అభివృద్ధి చేయాలనే లక్ష్యం కూడా ఉందన్నారు. కొన్నిరోడ్లను తీసుకుని పీపీటీ విధానంలో అభివృద్ధి పర్చ నున్నట్టు చెప్పారు. ఏలూరు, జంగారెడ్డిగూడెం రహదారి కూడా ఇందులో ఉంద న్నారు. చింతలపూడి ఎమ్మెల్యే రోషన్ కుమార్, ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణ, మాజీ ఎమ్మెల్యే ఘంటామురళీ, బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్‌కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



ఉచితంగా భోజనం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు సజ్జా బాబి

67వ రోజు అన్నక్యాంటీన్

కైకలూరు ఆగస్టు 24: టీడీపీ నాయకుడు సజ్జా బాబి పుట్టినరోజు సందర్భంగా శనివారం కైకలూరు అన్న క్యాంటీన్ వద్ద పేదలకు ఉచితంగా భోజనం పంపిణీ చేసి ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్ అందించారు. ఈ సందర్భంగా పలువురు నేతలు మాట్లాడుతూ కైకలూరులో 67 రోజులుగా దాతల సహకారంతో అన్నక్యాంటీన్ నిర్వహిస్తున్నామని ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చేవరకు దాతల సహకారంతో అన్నక్యాంటీన్‌ను నడుపుతామన్నారు. జనసేన నాయకుడు కొల్లి వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా గంగానమ్మ జాతర

కైకలూరు ఆగస్టు 24: గోపవరంలో గ్రామదేవత గంగానమ్మ జాతర వైభవంగా నిర్వహించారు. శనివారం అమ్మవారిని మేళతాళాలతో ఊరేగించారు. ఇంటింటా మహిళలు అమ్మవారికి హారతులు పట్టి పూజలు చేశారు. ఆలయ కమిటీ, గ్రామపెద్దల ఆధ్వర్యంలో సంబరాలను ఘనంగా నిర్వహించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడి పవిత్రోత్సవాలు ప్రారంభం



ముదినేపల్లి, ఆగస్టు 24 : మండ లంలోని సింగరాయపాలెం - చేవూరు పాలెం సెంటర్‌లో ఉన్న శ్రీ వల్లీదేవ సేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్ల పవిత్రోత్స వాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సంధ్య స్వామి సన్నిధిలో విఘ్నేశ్వర పూజ, దీక్షాధారణ, మండపార్చనలు జరిపిన అనంతరం భక్తులు పూజలు చేశారు. యాజ్ఞికులు గూడూరు రామకృష్ణ శర్మ, తోలేటి వీరభద్ర శర్మ, ఆలయ అర్చకులు కోట శివశంకర శర్మ, రుద్రపాక బాలగంగాధర తిలక్ హోమాలు, పూజలు నిర్వహించారు.



అల్లూరు శ్రీ కృష్ణమందిర ప్రతిష్ఠకు యాగశాల నిర్మాణం



ప్రతిష్ఠించనున్న విగ్రహాలు

రేపటి నుంచి శ్రీ కృష్ణ మందిర ప్రతిష్ఠోత్సవాలు

ముదినేపల్లి, ఆగస్టు 24: మండలంలోని అల్లూరులో నిర్మించిన శ్రీ కృష్ణ మందిర ప్రతిష్ఠోత్సవాలు ఈ నెల 26 నుంచి ప్రారంభం కానున్నాయి. దాతలు, గ్రామస్థుల విరాళాలు సుమారు రూ. 40 లక్షలతో నిర్మించిన ఈ ఆలయంలో శ్రీకృష్ణుడు, విఘ్నేశ్వర, సత్యనారాయణ స్వామి విగ్రహాలు ఈ నెల 28న ప్రతిష్ఠించనున్నారు. 26న గోపూజ, యాగశాల ప్రవేశం, హోమాలు, 27న వాస్తు హోమం, గ్రామ ప్రదక్షిణ, విగ్రహాల జలాధివాసం, క్షీరాధివాసం, 28న ఆలయ ప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠ, మహా పూర్ణాహుతి, శాంతి కల్యాణం, అన్న సమారాధన జరుగుతుందని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

బదిలీల కోసం ఉద్యోగుల..
ఉరుకులు.. పరుగులు



▸ముదినేపల్లి నుంచి కృష్ణా జిల్లా వైపు మొగ్గు ▸నేతల సిఫార్సు కోసం యత్నాలు

ముదినేపల్లి, ఆగస్టు 24 : బదిలీల కోసం వివిధ శాఖల అధికారులు, సిబ్బంది తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల్లో బదిలీలకు ఎక్కువ శాతం ఉద్యోగులు ప్రయత్నిస్తున్నారు. ముదినేపల్లి మండలంలో బదిలీలు కోరుకునే ఉద్యోగుల సంఖ్య మరింత ఎక్కువగా ఉంది. కృష్ణా జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఏలూరు జిల్లాలోని ముదినేపల్లి మండలంలో ఉద్యోగాలు చేస్తున్న పంచాయతీల కార్యదర్శులు, వీఆర్వోలు పలు కార్యాలయాల్లోని సిబ్బంది తమ నివాస ప్రాంతానికి దగ్గరలోని మండలాలకు బదిలీ చేయించుకునేందుకు గుడివాడ, పెడన, మచిలీపట్నం శాసనసభ్యుల సిఫార్సుల కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఇప్పటికే ముదినేపల్లి తహసీల్దార్‌గా మండవల్లి తహసీల్దార్ సుబానీని బదిలీపై నియమించగా, ఎంపీడీవో పోస్టు కోసం పామర్రు ఎంపీడీవో వై.రామకృష్ణ ప్రయత్నిస్తున్నారు. ఇక వీఆర్వోలు కొంతమంది మండలంలోని గ్రామాలకు బదిలీ చేయించాలని నాయకుల సిఫార్సుల కోసం ప్రయత్నిస్తున్నారు. అయిదేళ్ల సర్వీసు పూర్తి కాకపోయినా స్థానిక నాయకుల కోరిక మేరకు వీఆర్వోల బదిలీలు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మండలంలోని పంచాయతీల కార్యదర్శులు కొంతమంది ఇప్పటికే కృష్ణా జిల్లాలోని తమకు నచ్చిన పంచాయతీలకు బదిలీపై వెళ్లగా, ఏలూరు, తూర్పు గోదావరి జిల్లాల నుంచి ప్రమోషన్లపై ముదినేపల్లి మండలానికి వచ్చిన పంచాయతీల కార్యదర్శులు తిరిగి తమ జిల్లాలకు బదిలీ చేయించుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. వారు శనివారం కృష్ణా జిల్లా పరిషత్ కార్యాలయంలో బదిలీలకు దరఖాస్తు చేశారు. తిరిగి సాధారణ బదిలీలు ఇప్పట్లో ఉండే అవకాశం లేనందున పంచాయతీ కార్యదర్శులు, వీఆర్వోలు బదిలీల కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఈ నెలాకరులోగా బదిలీలు పూర్తి కానున్నందున ఉద్యోగులు కూటమి నాయకుల సిఫార్సుల కోసం విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.

మరణాలకు జ్వరాలు కారణమా.. కాదా?

▸అధికారులను ప్రశ్నించిన మంత్రి పార్థసారథి

▸అనారోగ్య కారణాల వల్లే మరణాలు సంభవించాయన్న డీఎంఅండ్‌హెచ్‌వో

▸వైద్యశాఖాధికారులతో జ్వరాలపై మంత్రి సమీక్ష



జ్వరాలపై సమీక్షిస్తున్న మంత్రి పార్థసారథి

చాట్రాయి, ఆగస్టు 24: నరసింహారావుపాలెంలో ఇటీవల జ్వరాలతో 20 మంది వరకు మరణించినట్లు స్థానికులు తన దృష్టికి తెచ్చారని ఇది వాస్తవమా? కాదా? అని డీఎంఅండ్‌హెచ్‌వో శర్మిష్టను రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి పార్థసారథి ప్రశ్నించారు. వర్షాలు ఎక్కువగా పడుతున్నందున అన్ని చోట్లా సీజనల్ జ్వరాలు వస్తున్నాయని, అయితే మరణాలకు జ్వరాలు కారణం కాదని, పలు అనారోగ్య సమస్యలతో వారు మృతి చెందినట్లు గుర్తించామని డీఎంఅండ్‌హెచ్‌వో వివరించారు. మండలంలోని నరసింహారావుపాలెం వెల్‌నెస్ సెంటర్ వద్ద శనివారం రాత్రి వైద్యశాఖ అధికారులతో మంత్రి జ్వరాలపై సమీక్షించారు. డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో శానిటేషన్, దోమల మందు పిచికారీ చేయిస్తున్నామని, జ్వరాలు ఎక్కువగా ఉన్న గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, మందులకు కొరత లేదని అన్నారు. దీనిపై మంత్రి మాట్లాడుతూ జ్వరాల నివారణకు అన్ని చర్యలు చేపట్టాలని, జ్వరాలతో ఎవరూ మరణించకూడదని వైద్యశాఖ అధికారులను ఆదేశించారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించటానికి ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందని చెప్పారు. అంతకు ముందు చీపురుగూడెంలో టీడీపీ నాయకుడు మందలపు జగదీష్ ఇంట శుభకార్యంలో మంత్రి పాల్గొన్నారు. కోటపాడులో అనారోగ్యంతో ఉన్న గ్రామ టీడీపీ అధ్యక్షుడు మంచిన పూర్ణచంద్రరావును పరామర్శించారు. చిన్నంపేటలో స్థానికులతో సమావేశమై సమస్యలు అడిగి తెలుసుకున్నారు. డీఎస్‌వో నరేంద్రకృష్ణ, డీఎంవో పీఎస్ఎస్ ప్రసాద్, డిప్యూటీ డీఎంహెచ్‌వో లక్ష్మీనారాయణ, వివిధ శాఖల అధికారులు, అన్ని గ్రామాల నాయకులు పాల్గొన్నారు.



దేవపూడి పీఏసీఎస్ వద్ద సంఘ సీఈవో, ఉద్యోగుల నిరసన

పీఏసీఎస్‌లలో కంప్యూటరీకరణ బహిష్కరణ

నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరు

ముదినేపల్లి, ఆగస్టు 24 : ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల రికార్డుల కంప్యూటరీకరణ ప్రక్రియలో సంఘాల ఉద్యోగులు వర్క్ టూ రూల్ పాటిస్తున్నారు. కంప్యూటరీకరణను ప్రభుత్వ సెలవుదినాల్లో బహిష్కరించాలని ఏపీ పీఏసీఎస్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపు మేరకు సంఘాల ఉద్యోగులు పని దినాల్లోనే రికార్డుల కంప్యూటరైజేషన్ చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా ముదినేపల్లి సహ కేంద్ర బ్యాంకు బ్రాంచి పరిధిలోని పీఏసీఎస్ సీఈవోలు, ఇతర ఉద్యోగులు శనివారం కంప్యూటరీకరణ పనులను బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. అధికారుల ఆదేశాలతో సంఘాల ఉద్యోగులు తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని, 24/7 విధానాన్ని అమలు చేయలేమని సంఘాల సీఈవోలు చెబుతున్నారు. ఏపీ పీఏసీఎస్ ఏలూరు జిల్లా శాఖ ఉపాధ్యక్షుడు పళ్లెం శ్రీనివాసరావు, ముదినేపల్లి బ్రాంచి సీఈవోల సంఘ నాయకుల ఆధ్వర్యంలో ఉద్యోగులు నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెలవు దినాలైన ఆది, సోమవారాల్లో రికార్డుల కంప్యూటరీకరణ చేపట్టేది లేదని స్పష్టం చేస్తూ ఉద్యోగులపై ఒత్తిడి తగ్గించాలని పలువురు డిమాండ్ చేశారు.



గుడిపాడులో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

జ్వరాలతో అప్రమత్తంగా ఉండాలి

ముసునూరు, ఆగస్టు 24: వాతావరణ పరిస్థితులు, దోమల వల్ల వ్యాప్తి చెందే జ్వరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు డాక్టర్ కరీముల్లా అన్నారు. శనివారం రమణక్కపేట పీహెచ్‌సీ పరిధిలోని గుడిపాడు దళితవాడ, మర్లపాలెంలో వైద్యశిబిరాలను నిర్వహించారు. 149 మందికి వైద్యపరీక్షలు నిర్వహించగా, 12 మందికి జ్వరం ఉన్నట్టు గుర్తించామని, వీరికి టైఫాయిడ్, మలేరియా, డెంగీ పరీక్షలు చేయగా నెగిటివ్ వచ్చినట్టు వైద్యుడు కరీముల్లా తెలిపారు. తలనొప్పి, ఒంటి నొప్పులు, జ్వరం తదితర ఆరోగ్య సమస్యలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించి, తగు చికిత్స పొందాలని కరీముల్లా కోరారు. ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, హెల్త్ సూపర్‌వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఈవ్ టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన



చాట్రాయి, ఆగస్టు 24: మండలంలోని పోలవరం జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు శనివారం నూజివీడు రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్సై స్వామి ఈవ్ టీజింగ్‌పై అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్ నిరోధానికి విద్యార్థులు సహకరించాలన్నారు. కొత్త వ్యక్తుల సమాచారం, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు నిర్వహించే వారిపై పోలీసులకు తెలియజేయాలన్నారు. సోషల్ మీడియా ద్వారా జరిగే అనర్థాలు, ఆన్‌లైన్ మోసాలు, రహదారి ప్రమాదాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో సుబ్బారావు

ఓపెన్ స్కూల్‌లో విద్యార్థులను చేర్చండి

ముసునూరు, ఆగస్టు 24: చదువు మానివేసిన విద్యార్థులను ఓపెన్ స్కూల్‌లో చేర్చేలా కృషి చేయాలని మండల విద్యాశాఖాధికారి బీవీ సుబ్బారావు అన్నారు. శనివారం ఓపెన్ స్కూల్ దూర విద్యా విధానం ద్వారా పదవ తరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలపై వెలుగు కార్యాలయంలో వెలుగు వీవోఏలతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ చదువు మానివేసిన విద్యార్థులను ఓపెన్ స్కూల్ చేర్చడం, పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులను ఇంటర్మీడియట్‌లో చేర్చేలా కృషి చేయాలని ఆయన కోరారు. ముసునూరు జడ్పీ పాఠశాలలో ఓపెన్ స్కూల్‌లో చేరే అవకాశం ఉందన్నారు. ఇన్‌చార్జ్ ఏపీఎం కె.బాబు, మండల సమాఖ్య అధ్యక్షురాలు బి.పద్మావతి, వీవోఏలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాల వితరణ

ముదినేపల్లి, ఆగస్టు 24 : మండలంలోని పెయ్యేరు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆ గ్రామ టీడీపీ అధ్యక్షుడు జొన్నలగడ్డ వీరాస్వామి రూ.6 వేల విలువైన పలకలు, నోటు పుస్తకాలు, పెన్సిళ్లు, ఇతర మెటీరియల్ శనివారం బహూకరించారు. ఎస్ఎంసీ ఛైర్మన్ మున్నీసా, వైస్ ఛైర్మన్ భవాని, హెచ్ఎం రాజేంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.





కైకలూరు జాగృతి, ముదినేపల్లి ఇండో సాక్సన్ స్కూల్‌లో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా..

▸పాఠశాలల్లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు ▸విద్యార్థులకు గోపిక, కృష్ణుల వేషధారణ

కైకలూరు, ఆగస్టు 24: కైకలూరు జాగృతి స్కూల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపిక వేషధారణలతో చేసిన నృత్య ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. కృష్ణాష్టమి విశిష్టతను విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ పానెం జయకిషోర్‌బాబు, డైరెక్టర్ కిరణ్‌బాబు, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ముదినేపల్లిలోని ఇండో సాక్సన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లులో శనివారం కృష్ణాష్టమి వేడుకలు కోలాహలంగా జరిగాయి. స్కూల్ కరస్పాండెంట్ జార్జి ఆధ్వర్యంలో విద్యార్థులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సాంస్కృతిక ప్రదర్శనలు, ఉట్టి కొట్టే కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్తమ వేషధారణలకు బహుమతులు అందజేశారు.

నూజివీడు టౌన్: నూజివీడు జడ్పీ ఉన్నత పాఠశాలలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సోమవారం సెలవు దినం కావడంతో శనివారమే ఈకార్యక్రమాన్ని నిర్వహించా రు. సంస్కృతి సంప్రదాయాలు తెలిపేందుకు శ్రీకృష్ణ వేషధారణతో ఉట్టి కొట్టే కార్యక్రమాన్ని ఉత్సా హంగా జరిపారు. హెచ్.ఎం హేమలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



నూజివీడు జడ్పీ హైస్కూలులో ఉట్టికొట్టే వేడుక



ర్యాలీ నిర్వహిస్తున్న ట్రిపుల్ ఐటీ విద్యార్థులు

కోల్‌కతా ఘటనపై ట్రిపుల్ ఐటీ విద్యార్థుల నిరసన

నూజివీడు టౌన్, ఆగస్టు 24: మౌనాన్ని వీడుదాం బాధితులకు సంఘీభావంగా నిలిచి దోషులకు కఠిన శిక్ష పడేలా చేద్దాం అంటూ నూజివీడు ట్రిపుల్ ఐటీ విద్యార్థులు కోల్‌కతా ఘటనపై ర్యాలీ నిర్వహించారు. పెద్ద గాంధీ బొమ్మ సెంటర్లో మానవహారాన్ని నిర్మించారు. ఈ సందర్భంగా వైద్యురాలిపై జరిగిన హత్యాచారంపై మౌనాన్ని వీడాలని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా దోషులను కఠినంగా శిక్షించాలని విద్యార్థులు డిమాండ్ చేశారు. ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.చంద్రశేఖర్, ఏవో బి.లక్ష్మణరావు, డీన్స్, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

పల్లెర్లమూడిలో పోలీసుల పల్లెనిద్ర



నూజివీడు టౌన్, ఆగస్టు 24: సైబర్ నేరాలపై గ్రామస్థులు అవగాహనతో వ్యవహరించాలని నూజివీడు రూరల్ ఎస్సై మల్లికార్జున రెడ్డి అన్నారు. పల్లెర్లమూడిలో పల్లెనిద్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలపై పలు జాగ్రత్తలను వివరించారు. హెల్మెట్ ధారణ, మహిళా చట్టాలు, దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు.

బాల్య వివాహాలపై సమాచారం ఇవ్వాలి

నూజివీడు టౌన్, ఆగస్టు 24: బాల్య వివాహాలపై సమాచారం ఇస్తూ బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. నూజివీడు మండలం అన్నవరంలో మిషన్ శక్తిపై శనివారం అవగాహన సదస్సును నిర్వహించారు. బాలికా విద్యను ప్రోత్సహించాలన్నారు. మహిళా చట్టాలను వివరించారు. అంగన్వాడీ టీచర్లు జ్యోతి కుమారి, మారేశ్వరి, విజయలక్ష్మి, రమణ, అరుణకుమారి పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుకు మంత్రికి వినతి

ముసునూరు, ఆగస్టు 24: మండలంలోని రమణక్కపేట జడ్పీ పాఠశాలలో బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుకు సహకరించాలని రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథిని పాఠశాల పీడీ వాకా నాగరాజు కోరారు. రమణక్కపేట విచ్చేసిన మంత్రికి ఆయన విద్యార్థులతో కలిసి వినతిపత్రం అందజేశారు. మంత్రి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు ఆటల్లో ప్రావీణ్యం సాధించాలని, తప్పనిసరిగా బాస్కెట్‌బాల్ కోర్టు ఏర్పాటుకు నిధులు విడుదలయ్యేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. గోపవరంలోని గ్రామదేవత గంగమ్మ వారికి మంత్రి కొలుసు పార్థసారథి పూజలు నిర్వహించారు. మూడోరోజు అమ్మవారి జాతరలో ఆయన పాల్గొన్నారు. అన్నదానం తదితర కార్యక్రమాలకు ఆర్థిక సాయం అందజేశారు. నిర్వాహకులు ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రముఖులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ అశోక్‌కు పీహెచ్‌డీ



ఆగిరిపల్లి, ఆగస్టు 24: ఆగిరిపల్లి ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఈసీఈ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా సేవలందిస్తున్న తమ్మిశెట్టి అశోక్‌కు విట్ ఏపీ యూనివర్సిటీ అమరావతి పీహెచ్‌డీ ప్రదానం చేసింది. ఈయన విట్ ఏపీ యూనివర్సిటీ ఈసీఈ విభాగం ఆచార్యులు డాక్టర్ చందన్‌కుమార్ పాండే పర్యవేక్షణలో సిమ్యులేషన్ అండ్ మోడలింగ్ అంశంపై పరిశోధన చేశారు. ఎన్ఆర్ఐ కళాశాల ఛైర్మన్ డాక్టర్ వెంకటరావు, ప్రిన్సిపాల్ నాగభాస్కర్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ జి.సాంబశివరావు, అడ్మిన్ డైరెక్టర్ టి.వెంకటేశ్వరరావు తదితరులు అశోక్‌ను అభినందించారు.

వసతి గృహాల తనిఖీ



స్నేహా రైడ్స్‌లో అధికారుల తనిఖీ

నూజివీడు, ఆగస్టు 24: నూజివీడు బాలసదన్‌తో పాటు పట్టణంలోని పలు బాల బాలికల వసతి గృహాలను జిల్లాస్థాయి అధికారుల బృందం శనివారం ఆకస్మిక తనిఖీ చేసింది. జిల్లా ప్రొబెషన్ ఆఫీసర్ జె.దుర్గాప్రసాద్, డీసీపీవో సీహెచ్ సూర్యచక్రవేణి నేతృత్వంలోని అధికారులు వసతిగృహాలను తనిఖీచేసి విద్యార్థులకు అందుతున్న భోజన వసతులను పరిశీలించారు. జువైనల్ జస్టిస్ యాక్ట్ ప్రకారం నిబంధనలను పాటించాలని సూచించారు. సీడీపీవో నూరానీ, సీహెచ్ శ్రీకాంత్, జాహ్నవి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత మెగా వైద్య శిబిరం

ఆగిరిపల్లి, ఆగస్టు 24: ఆగిరిపల్లి ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో ఆదివారం ఉదయం 10 గంటలకు ప్రపంచ మానవహక్కుల అవగాహన సంఘం ఆధ్వర్యంలో మీడియా సహకారంతో సెంటినీ ఆస్పత్రి సౌజన్యంతో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్టు సంఘం ఏలూరు జిల్లా ఛైర్మన్ నంజం రామకృష్ణ తెలిపారు. ఈ శిబిరంలో సాధారణ వ్యాధులు, కంటి సమస్యలు స్త్రీ సంబంధ వ్యాధులు, ఊపిరితిత్తుల సమస్యలపై స్పెషలిస్ట్ డాక్టర్లతో పరీక్షలు నిర్వహించి ఉచిత వైద్యం, సలహాలు, సూచనలు ఇస్తారని, ముఖ్య అతిథిగా మంత్రి పార్థసారథి విచ్చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

దోమల నివారణ చర్యలు



ముసునూరు, ఆగస్టు 24: దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్టు సర్పంచ్ పులిబళ్ల లక్ష్మీ సత్యనారాయణ అన్నారు. అక్కిరెడ్డిగూడెంలో శనివారం దోమల నివారణకు సర్పంచ్, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో ఫాగింగ్ చేశారు. అలాగే మురుగునీటి నిల్వలను తొలగించి, మలాథియాన్ పిచికారీ చేశారు. అలాగే చెత్తాచెదారాన్ని తొలగించి, బ్లీచింగ్ చల్లించారు. ప్రజలు జ్వరాల బారిన పడకుండా పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తెలిపారు. కార్యదర్శి విద్యాధరరావు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

హెచ్ఐవీపై అవగాహన



ముదినేపల్లి, ఆగస్టు 24 : ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అండ్ చైల్డ్ ఫండ్ ఇండియా స్కీం సంయుక్తంగా శనివారం ముదినేపల్లి మండలంలో హెచ్ఐవీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించాయి. సొసైటీ ప్రతినిధి సీహెచ్.నాగలక్ష్మి, ఆశా వర్కర్ పి.భవానీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి హెచ్ఐవీ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ఈ వ్యాధి సోకిన వారిని చులకనగా చూడవద్దని కోరారు.